ఆంధ్రజ్యోతి
ANDHRAJYOTHY
కాకినాడ
జిల్లా వార్తలు
శనివారం 9 నవంబరు 2024 | 5





ఊపిరి తీసిన ఉపాధి!



ఏలేరు వాగు వద్ద ఇసుక లోడు చేస్తున్న ట్రాక్టర్



ఏలేరు వాగులో తేలిన మృతదేహం



రోదిస్తున్న కుటుంబ సభ్యులు

ఉపాధి ఊపిరి తీసింది.. నలుగురి ప్రాణాలు బలిగొంది. ఇసుక గుంతలు ఎంత ప్రమాదకరమో చెప్పకనే చెప్పింది.. అల్లూరి సీతారామరాజు జిల్లా అడ్డతీగల మండలం బొంగ రాలపాడులో ఉన్న ఏలేరు వాగులో ఇసుక తీతకు నలుగురు కూలీలు వెళ్లారు.. ఉదయం అంతా పనిచేశారు.. మధ్యాహ్నం సమయానికి మరింత లోతుకు వెళ్లారు.. అయితే నలుగురిలో ఒకరు ముందుకు వెళ్లగా ఇసుక గుంతలో పడి కొట్టుకుంటున్నాడు.. ఇది గమనించిన మరో ఇద్దరు అతన్ని కాపాడేందుకు ముందుకెళ్లారు.. ఆ ముగ్గురు లోపలకు వెళ్లిపోతుండగా మరొకరు గమనించి పట్టుకున్నారు.. ఇలా ఒకరి వెంట మరొకరు.. నలుగురు మునిగిపోయారు.. నలుగురూ గల్లంతయ్యారు.. - వివరాలు 7లో

అన్నార్తులకు 'అక్షయపాత్రే'

కాకినాడ జీజీహెచ్‌లో హరేకృష్ణా మూమెంట్ సంస్థ ఆధ్వర్యంలో 'సుభోజనం'

నిత్యం రెండు వేల మంది రోగులు, సహాయకులకు ఉచితంగా భోజనం

- ప్రత్యేక కథనం 6లో

మ్యాపింగ్‌తో పింఛన్‌దారుల్లో ఆందోళన

బ్యాంకు ఖాతాల్లో జమ కోసమేనని అధికారుల స్పష్టత

కలెక్టరేట్(కాకినాడ), నవంబరు 8 (ఆంధ్రజ్యోతి): జిల్లావ్యాప్తంగా జరుగుతున్న ఎన్‌పీసీఐ మ్యాపింగ్‌తో ఎన్‌టీఆర్ భరోసా పింఛన్‌దారుల్లో ఆందోళన నెలకొంది. తమ పింఛన్లు ఎక్కడ ఆగిపోతాయోననే భయం పట్టుకుంది. కాకినాడ జిల్లాలో గత మూడ్రోజులుగా ఎన్‌పీసీఐ మ్యాపింగ్ ఒక డ్రైవ్ తరహాలో చేస్తున్నారు. ప్రభుత్వ పథకాల ద్వారా సొమ్ములు అందుకుంటున్న లబ్ధిదారుల్లో ఎవరికైతే బ్యాంకు ఖాతాలకు ఆధార్ అనుసంధానం లేదో వారికి ఆధార్ అనుసంధానం చేయిస్తున్నారు. దీని ద్వారా నేషనల్ పేమెంట్ కార్పొరేషన్ ఆఫ్‌ఇండియా(ఎన్‌పీసీఐ) మ్యాపింగ్ చేస్తున్నారు. ప్రధానంగా బ్యాంకుల్లో ప్రధాన పోస్టాఫీసుల్లో సేవింగ్ ఎకౌంట్ ఖాతాలతో ఆధార్ అనుసంధానం జరుగుతుంది. పోస్టాఫీసుల్లో ఐపీపీబీ సేవింగ్స్ ఖాతాలను కొత్తగా తెరిపించి ఆధార్ అనుసంధానం చేస్తున్నారు. తద్వారా ఎన్‌పీసీఐ మ్యాపింగ్ జరుగుతుంది. జిల్లావ్యాప్తంగా అన్ని మండలాల్లో ఈ ప్రక్రియ జరుగుతోంది. ఆయా సచివాలయాల పరిధిలో గ్రామ, వార్డు సచివాలయ ఉద్యోగుల ద్వారా ఆధార్ అనుసంధానానికి లబ్ధిదారులకు దిశానిర్దేశం చేస్తున్నారు. అయితే జిల్లాలో పెద్దసంఖ్యలో ఎన్‌టీఆర్ భరోసా పింఛన్‌దారులకు బ్యాంకు ఖాతాతో, ఆధార్ అనుసంధానం కాలేదు. ఈ నేపథ్యంలో వారిని ఆధార్ అనుసంధానం చేసుకోవాలని అధికారులు ఆదేశించడంతో భయాందోళనకు గురవుతున్నారు. తమ పింఛన్ల పరిశీలన జరిగి తీసేస్తారనే భయం వ్యక్తం చేస్తున్నారు. తాము పొరపాటున అనర్హుల జాబితాలోకి వెళితే తమ పరిస్థితి ఏమిటనే ఆందోళన నెలకొంది. ఇక అనర్హులై ఉండి పింఛను పొందుతున్న వారైతే హడలిపోతున్నారు. అయితే ఇది అర్హులా కాదా అనే విషయానికి సంబంధించినది కాదని, కేవలం బ్యాంకు ఖాతాల నిమిత్తమే ఈ మ్యాపింగ్ జరుగుతోందని అధికారులు స్పష్టంచేస్తున్నారు. దీనిపై డీఆర్‌డీఏ ఇన్‌చార్జి పీడీ శ్రీరమణి మాట్లాడుతూ రాష్ట్రంలో అమలు జరుగుతున్న ప్రభుత్వ పథకాల సొమ్మును ఆయా లబ్ధిదారుల బ్యాంకుఖాతాల్లో నేరుగా జమ చేయడానికి ఎన్‌పీసీఐ మ్యాపింగ్ జరుగుతోందని, ఎన్‌టీఆర్ భరోసా పింఛన్‌దారులు ఆందోళన చెందనవసరం లేదని చెప్పారు.



రౌతులపూడిలో అక్రమ లేటరైట్ డంప్

'అరాచకం' అంతుతేలేనా..

కాకినాడ-అనకాపల్లి జిల్లాల ఉమ్మడి సరిహద్దు ప్రాంతం బమిడికలొద్దులో గత వైసీపీ పెద్దలు సాగించిన లేటరైట్ అక్రమాల అంతు తేల్చేందుకు రంగం సిద్ధమవుతోంది. అధికారం అండతో అనుమతులతో సంబంధం లేకుండా అడ్డగోలుగా జరిపిన తవ్వకాలపై కూటమి ప్రభుత్వం సీఐడీ విచారణకు ఆదేశించింది. తవ్విన లేటరైట్‌ను కాకినాడ జిల్లా మీదుగా తరలించడం కోసం అప్పట్లో ఏకంగా రౌతులపూడి మండలంలో రిజర్వు ఫారెస్ట్‌ను తొలిచేసి రహదారిని నిర్మించి లేటరైట్‌ను తరలించేశారు. దీనిపై అప్పట్లో ప్రతిపక్షం ఆందోళన చేసినా ప్రభుత్వ పెద్దలు పట్టించుకోలేదు. ఇప్పుడు సీఐడీ విచారణతో నిజాలు నిగ్గుతేలనున్నాయి.



రిజర్వుఫారెస్ట్‌లో నిర్మించిన రహదారి

- బమిడికలొద్ది లేటరైట్ మైనింగ్ అక్రమాలెన్నో
- వైసీపీ హయాంలో అడ్డగోలు తవ్వకాలపై సీఐడీ విచారణకు ప్రభుత్వం ఆదేశం
- అప్పట్లో భారతి సిమెంట్ కంపెనీ కోసం జిల్లాలో ప్రభుత్వ పెద్దలు, అధికారులు అరాచకం
- అనకాపల్లి-కాకినాడ జిల్లాల ఉమ్మడి సరిహద్దులో లేటరైట్ కోసం బరితెగింపు
- రౌతులపూడిలో రిజర్వు ఫారెస్ట్‌ను చీల్చి రోడ్డు నిర్మాణం
- ఇక్కడి నుంచే వందల టిప్పర్లలో కత్తిపూడి హైవే మీదుగా కడప తరలింపు
- కోట్ల విలువైన లేటరైట్ కుంభకోణంపై సీఐడీ ఏం తేల్చుతుందనేదానిపై ఉత్కంఠ

(కాకినాడ-ఆంధ్రజ్యోతి)

అనకాపల్లి జిల్లా నాతవరం మండలం బమిడికలొద్దు వద్ద లేటరైట్ కొండలు భారీగా ఉన్నాయి. ఇక్కడ లేటరైట్‌ను తన్నుకుపోతే కడపలో అప్పటి సీఎం జగన్ భారతి సిమెంట్‌కు కావలసినంత ముడివనరులకు ఢోకా ఉండదని 2021 జూలైలో అప్పటి ప్రభుత్వ పెద్దలు పథకం పన్నారు. అందులో భాగంగా సదరు లీజుదారుడిని బెదిరించి లేటరైట్ లాగేసుకున్నారు. దీన్ని జాతీయరహదారి మీదుగా కడపలోని సిమెంట్ ఫ్యాక్టరీకి తరలించే దగ్గర చిక్కొచ్చింది. మామూలుగా అయితే నాతవరం నుంచి కోటనందూరు మీదుగా తుని హైవే పైకి ఈ లేటరైట్‌ను తరలించాలి. కానీ ప్రతిపక్ష టీడీపీకి తెలిసిపోతుందనే కారణంతో కాకినాడ జిల్లా మీదుగా గుట్టుగా తరలించడానికి ప్రణాళికలు వేశారు. ఈనేపథ్యంలో బమిడికలొద్దు లేటరైట్ క్వారీకి అతి సమీపంలో ఉన్న రౌతులపూడి మండలంపై కన్నేశారు. ఈ మండలం మీదుగా లేటరైట్ తరలించుకుంటే ఇబ్బందులు ఉండవని భావించారు. కానీ పూర్తిగా రిజర్వుఫారెస్ట్ అడ్డు ఉండడంతో ఏంచేయాలో ఆలోచించి చివరకు చేతిలోని అధికారం ఉండడంతో అప్పటి జిల్లా ప్రాంతీయ సమన్వయకర్త అయిన ఎంపీ మిథున్ రెడ్డి బరితెగించేశారు. అప్పటి ప్రభుత్వంలో వైసీపీ కార్యకర్తగా వ్యవహరించిన కలెక్టర్ మురళీధర రెడ్డితోపాటు అటవీ అధికారుల సాయంతో రిజర్వుఫారెస్ట్ మీదుగా రహదారి నిర్మాణానికి సిద్ధమయ్యారు. వాస్తవానికి రౌతులపూడి మండలం జల్దాం, చల్లూరు, దబ్బాది తదితర గ్రామాల గిరిజనులు ఏ పనిమీద అయినా నాతవరం మండలం వెళ్లాలంటే కాలినడక లేదంటే ద్విచక్ర వాహనమే గత్యంతరం. ఎన్నిసార్లు మొత్తుకున్నా గత ప్రభుత్వాలు రహదారి వేయలేదు. అయితే తమకు ఎలాగూ ఈ మార్గంలో లేటరైట్ తరలింపునకు దారి అవసరం ఉండడంతో అనుమానం రాకుండా మిథున్‌రెడ్డి కనుసన్నల్లో పంచాయతీ రాజ్‌శాఖను రంగంలోకి దించారు. ఈశాఖ ద్వారా ఉపాధిహామీ పని కింద గ్రావెల్ రహదారికి నిర్మాణానికి ప్రతిపాదనలు తయారుచేయించారు. అందులోభాగంగా బమిడికిలొద్దు నుంచి జల్దాం వరకు దాదాపు పన్నెండు కిలోమీటర్ల గ్రావెల్ రహదారిని యుద్ధప్రాతిపదికన నిర్మించేశారు. అందుకోసం చెల్లూరు-బమిడికలొద్దు మధ్యనున్న అయిదు కిలోమీటర్ల పరిధి రోడ్డు పూర్తిగా రిజర్వ్ ఫారెస్ట్. అటవీశాఖ అనుమతుల్లేకుండా ఎలాంటి పనులు చేయకూడదు. కానీ ఇవేవీ పట్టించుకోలేదు. రహదారికోసం అడ్డంగా ఉన్న టేకు, దండారి, నల్లమద్ది, తెల్లమద్ది, తుమ్మిడి, తెల్లగర్ర వంటి విలువైన భారీ వృక్షాలను నేలకూల్చేశారు. రిజర్వుఫారెస్ట్‌లో చిన్న చెట్టుకూడా నరకడానికి లేదు. కానీ ఇదేం ఖాతరు చేయకుండా ఇష్టానుసారం మూడువేలకు పైగా చెట్లను నేలకూల్చేశారు. ఆనవాళ్లు దొరకకుండా దుంగలుగా మార్చి వేరేచోటకు తరలించారు. వాస్తవానికి ఈ ఫారెస్ట్ పరిధిలో లేడి, దుప్పి, నెమళ్లు ఎన్నో ఉన్నాయి. వన్యప్రాణాలకు ముప్పు వాటిల్లకుండా ఈ ఫారెస్ట్ జోలికి వెళ్లకూడదని తెలిసినా ఖాతరు చేయలేదు.

అక్కడ తవ్వి..ఇక్కడ పోసి

నాతవరంలో తవ్విన వేల క్యూబిక్‌మీటర్ల లేటరైట్‌ను రౌతులపూడికి అడ్డగోలుగా నిర్మించిన రహదారిపై రోజూ వందల సంఖ్యలో టిప్పర్లలో తరలించేశారు. ఇందుకోసం చల్లూరు గ్రామంలో పాతిక ఎకరాల స్థలాన్ని లీజుకు తీసుకుని నిల్వ చేశారు. స్టాకు యార్డు నుంచి కడప జిల్లా నుంచి వచ్చే లారీల్లో సరుకు లోడింగ్ చేసి రౌతులపూడి మీదుగా కత్తిపూడి హైవే ద్వారా భారతి సిమెంట్‌కు తరలించేశారు. ఇలా అనకాపల్లి జిల్లాలో అక్రమ లేటరైట్ తవ్వకాల దగ్గర నుంచి రౌతులపూడిలో రిజర్వు ఫారెస్ట్‌ను నరికేసి నిబంధనలకు విరుద్ధంగా రహదారి నిర్మాణం, అనుమతులు లేకుండా లేటరైట్ డంపింగ్ యార్డుల వరకు అప్పటి ప్రభుత్వ పెద్దలు అరాచకంగా వ్యవహరించారు. అక్రమంలో జిల్లా కలెక్టర్ దగ్గర నుంచి అటవీశాఖ అధికారుల వరకు జీహుజూర్ అన్నారు. అయితే ప్రతిపక్ష పార్టీ హోదాలో టీడీపీ పోరాటం చేయడం, వ్యవహారం ఎన్జీటీ వరకు వెళ్లడంతో అప్పట్లో జిల్లా అటవీశాఖ అధికారిని ప్రభుత్వం బదిలీ చేయాల్సి వచ్చింది. అయితే ఇప్పుడు ప్రభుత్వం మారడంతో ఈ అక్రమాల పుట్ట కదలబోతోంది. నాడు అడ్డగోలుగా వ్యవహరించి అక్రమంగా లేటరైట్ తవ్వడం, ప్రభుత్వానికి సెస్ ఎగ్గొట్టడం, రిజర్వుఫారెస్ట్‌ను నరికేసి రహదారి నిర్మించడం, అనుమతులు లేకుండా డంపింగ్ తదితర అంశాలపై కూటమి ప్రభుత్వం డొంక కదల్చబోతోంది. ఈ మొత్తం అక్రమాలపై సీఐడీ ద్వారా విచారణ చేయించాలని నిర్ణయించింది. ఇదే విషయమై ఇటీవల అనకాపల్లి జిల్లాలో పర్యటించిన గనులశాఖ మంత్రి కొల్లు రవీంద్ర బమిడికలొద్ది లేటరైట్ అక్రమాలపై సీఐడీతో విచారణ చేయిస్తున్నట్టు అధికారికంగా ప్రకటించారు. ఈనేపథ్యంలో నాడు అరాచకంగా వ్యవహరించిన ప్రభుత్వ పెద్దల భాగోతం సీఐడీ తన విచారణలో నిగ్గు తేల్చనుంది. అలాగే జిల్లా కలెక్టర్ నుంచి అటవీ/గనులశాఖ అధికారుల పాత్ర.. ఎవరెవరు ఎలా సహకరించారు? అనేదానిపై లోతుగా దర్యాప్తు చేయనుంది. దీనికి సంబంధించి త్వరలో ప్రత్యేక బృందం ఏర్పాటు కానుంది. అయితే ఈ బృందంలో ఎవరెవరు ఉంటారనేది కొన్ని వారాల్లో స్పష్టత రానుంది.

ఆర్‌అండ్‌బీ రోడ్ల నిర్మాణాలకు గ్రీన్ సిగ్నల్

- ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లాలో 101 కిలోమీటర్ల మేర 14 రోడ్లు
- గత ప్రభుత్వంలో బిల్లుల చెల్లించక ఆగిపోయిన పనులు
- కూటమి ప్రభుత్వంలో రూ.30 కోట్లు చెల్లింపు
- చెల్లింపు ప్రక్రియలో రూ.8 కోట్లు
- మరో రూ.242 కోట్లు విడుదలకు సిద్ధం
- పనులు చేసేందుకు సంసిద్ధత వ్యక్తం చేసిన కాంట్రాక్టర్లు

కలెక్టరేట్(కాకినాడ), నవంబరు 8 (ఆంధ్రజ్యోతి): ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లాలో ఆర్‌అండ్‌బీ రోడ్ల నిర్మాణాలకు గ్రీన్ సిగ్నల్ వచ్చింది. 14 రోడ్లు 101 కిలోమీటర్ల మేర పనులు పూర్తి చేసేందుకు కాంట్రాక్టర్లు సంసిద్ధత వ్యక్తంచేశారు. దీంతో గత ప్రభుత్వంలో నిలిచిపోయిన పనులు పూర్తికానున్నాయి. 101 కిలోమీటర్ల మేరకు 14 రోడ్లు నిర్మించాలని రెండేళ్ల కిందట వైసీపీ ప్రభుత్వంలో టెండర్లు పిలిచి పనులు ఖరారు చేశారు. దీనికి రూ.290 కోట్లు నిధులు కేటాయించారు. అయితే పనులు ప్రారంభించిన తర్వాత చేసిన వాటికి బిల్లులు ఇవ్వకపోవడంతో కాంట్రాక్టర్లు మధ్యలోనే పనులు నిలుపుదల చేశారు. దీంతో రెండేళ్లుగా రోడ్లు అధ్వానంగానే ఉండిపోయాయి. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన వెంటనే రూ.30 కోట్లు కాంట్రాక్టర్లకు చెల్లించారు. మరో రూ.8 కోట్ల బిల్లులు చెల్లింపు దశలో ఉన్నాయి. వారంలో చెల్లించే అవకాశం ఉంది. మిగిలిన రూ.242 కోట్లు విడుదల చేస్తామని ప్రభుత్వం ప్రకటించడంతో మళ్లీ పనులు చేసేందుకు కాంట్రాక్టర్లు ముందుకు వస్తున్నారు.

14 రోడ్లు ఇవే..

దీనిలో జి.వేమవరం-గొర్రిపూడిరోడ్డు, కరప- ఇంద్రపాలెం-దోమాడ రోడ్డు, గొల్లపాలెం-కుయ్యేరురోడ్డు, మురమళ్ల -వెదుర్లంక-పోలవరంరోడ్డు, ముమ్మిడివరం- కాట్రేనికోనరోడ్డు, ముమ్మిడివ రం-ముక్తేశ్వరం రోడ్డు, విశ్వేశ్వరాయపురం-చిండిరోడ్డు, చింతలపూడి బ్రిడ్జి-మలికిపురం రోడ్డు, రాజమండ్రి- గోకవరం-ముగ్గళ్లరోడ్డు, రాజానగరం- వెస్ట్‌గోనగూడెం రోడ్డు, రాపాడు- చిన కొండేపూడి రోడ్డు, రేపాక- చిన కొండేపూడి రోడ్డు, రాజుపాలెం- రామవరం రోడ్డు, ఏలేశ్వరం- జడ్డంగి రోడ్లు ఉన్నాయి. వీటిని నిర్మాణాలు జరగనున్నాయి. అమరావతిలో గురువారం జరిగిన ఉన్నతాధికారుల సమావేశంలో ప్రభుత్వ హామీతో కాంట్రాక్టర్లు ముందుకు వచ్చారు. అయితే మెటీరియల్ రేట్లు పెరగడం వల్ల ప్రస్తుతం ఉన్న రేట్ల ప్రకారం బిల్లులు చెల్లించాలని కాంట్రాక్టర్లు కోరగా పరిశీలిస్తామని ఉన్నతాధికారులు చెప్పినట్టు సమాచారం.

త్వరలో పనులు ప్రారంభం



ఉమ్మడి తూర్పు గోదావరి జిల్లాలో 14 రోడ్ల నిర్మాణ పనులు ప్రారంభమవుతున్నాయి. దీనికి రూ.290 కోట్ల నిధులు కేటాయించగా, దీనిలో 30 శాతం రాష్ట్ర ప్రభుత్వం వాటా, 70 శాతం న్యూడెవలప్‌మెంట్ బ్యాంకు ప్రాజెక్టు నుంచి సమకూరింది.

- జి.కందు, ఆర్‌అండ్‌బీ ఎస్ఈ

ద్వారంపూడి మేనమామ రూ.100కోట్ల భూ దోపిడీ



- కాకినాడ సిటీ ఎమ్మెల్యే కొండబాబు
- కలెక్టర్‌కు ఫిర్యాదు

కాకినాడ సిటీ, నవంబరు 8(ఆంధ్రజ్యోతి): ఛేంజ్ ఆఫ్ ల్యాండ్ పేరుతో కాకినాడ నగరంలో మాజీ ఎమ్మెల్యే ద్వారంపూడి చంద్ర శేఖరరెడ్డి మేనమామ రూ.100 కోట్ల భూ దోపిడీకి తెరలేపారని కాకినాడ సిటీ ఎమ్మెల్యే వనమాడి కొండబాబు మండిపడ్డారు. కాకినాడ రాగంపేట శ్రీవిద్యాకాలనీలోని ఛేంజ్ ఆఫ్ ల్యాండ్ భూమిని శుక్రవారం పరిశీలించారు. ఈ సందర్భంగా కొండబాబు మీడియాతో మాట్లాడుతూ 2008లో గోపాలరెడ్డి జీవో తెచ్చుకుని శ్రీవిద్యాకాలనీలో విలువైన ప్రభుత్వ భూమిని తీసుకున్నా నేటికీ రాగంపేటలోని భూమిని ప్రభుత్వానికి అప్పగించకుండా స్వాధీనంలో ఉంచుకున్నారన్నారు. రాగంపేట భూమిలో ఇప్పటికీ పేదలకు ఇళ్లు నిర్మించలేదన్నారు. ప్రభుత్వానికి అప్పగించాల్సిన రాగంపేటలోని భూమిలో టెన్నిస్, షటిల్ కోర్టులుగా మార్చి కోట్ల రూపాయాలు దోచుకున్నారన్నారు. ఛేంజ్ ఆఫ్ ల్యాండ్ పేరుతో కాజేసిన శ్రీవిద్యాకాలనీ ప్రాంతం ఎంతో అభివృద్ధి చెందగా రాగంపేట మాత్రం అభివృద్ధి జరగలేదన్నారు. ఈ భూదోపిడీని ముఖ్యమంత్రి చంద్రబాబు దృష్టికి తీసుకెళ్తామని, పేదలకు ఇళ్లు నిర్మించేలా చర్యలు చేపడతామన్నారు. అనంతరం కలెక్టర్ షాన్ మోహన్‌ను ఎమ్మెల్యే కలిసి భూమిని స్వాధీనం చేసుకోవాలని వినతిపత్రం అందజేశారు. టీడీపీ నగర అధ్యక్షుడు మల్లిపూడి వీరు, తుమ్మల రమేష్, వొమ్మి బాలాజీ, గదుల సాయిబాబు, సత్యనారాయణ, బుజ్జి, రవి, అమన్ జైన్, బలరామ్, పెద్ద, బాబి పాల్గొన్నారు.

బీజేపీకి కార్యకర్తలే బలం

- వైద్యశాఖామంత్రి సత్యకుమార్



పెద్దాపురం, నవంబరు 8(ఆంధ్రజ్యోతి): బీజేపీకి కార్యకర్తలే కొండంత బలమని రాష్ట్ర వైద్యఆరోగ్యశాఖామంత్రి వై.సత్యకుమార్ అన్నారు. పెద్దాపురం రామారావుపేటలో ఏర్పాటు చేసిన బీజేపీ కార్యాలయాన్ని ఆయన శుక్రవారం ప్రారంభించారు. అనంతరం పార్టీ సభ్యత్వ నమోదు ఇన్‌చార్జ్ గొరకపూడి చిన్నయ్యదొర అధ్యక్షతన జరిగిన సమావేశంలో మంత్రి మాట్లాడుతూ పార్టీ ఆధ్వర్యంలో చేస్తు న్న పనులు, లక్ష్యాలను ప్రతిఇంటికి చేర్చడానికి కార్యకర్తలు కృషి చేయాలన్నారు. జనసేన కాకినాడ జిల్లా ఇన్‌చార్జ్ తుమ్మల రామస్వామి, బీజేపీ జిల్లా అధ్యక్షుడు చిలుకూరి రామ్‌కుమార్, దుర్గా మోహన్‌రావు, విత్తనాల వెంకటరమణ, రాజాసూరిబాబురాజు పాల్గొన్నారు.

టీటీడీ పాలక మండలి సభ్యుడిగా ఎమ్మెల్యే జ్యోతుల నెహ్రూ ప్రమాణస్వీకారం

జగ్గంపేట, నవంబరు 8(ఆంధ్రజ్యోతి): టీటీడీ ధర్మకర్తలి మండలి సభ్యుడిగా జగ్గంపేట ఎమ్మెల్యే జ్యోతుల నెహ్రూ శుక్రవారం ప్రమాణస్వీకారం చేశారు. శ్రీవారి ఆలయంలో టీటీడీ అదనపు ఈవో వెంకయ్య చౌదరి ఆయనతో ప్రమాణస్వీకారం చేయించారు. అనంతరం కుటుంబ సభ్యులతో కలిసి శ్రీవారిని దర్శించుకుని రంగనాయక మండపంలో జేఏవో శ్రీవారి తీర్థ ప్రసాదాలు శ్రీవారి చిత్రపటాన్ని అందించారు. అనంతరం కుటుంబసభ్యులంతా కలిసి మాతృశ్రీ తరిగొండ వెంగమాంబ ఉచిత భోజనశాలలో అన్నప్రసాదం స్వీకరించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే నెహ్రూ మాట్లాడుతూ కలియుగ ప్రత్యక్ష దైవం ఏడుకొండల వెంకటేశ్వర స్వామి సేవకుడిగా సేవ చేసే భాగ్యం కలవడం తన అదృష్టంగా భావిస్తున్నానన్నారు. తిరుమలకు వచ్చే భక్తుల సేవకు పునరంకితం అవ్వడం ఆనందంగా ఉందని, టీటీడీ బోర్డు సభ్యులందరం కలిసి తిరుమల పవిత్రతను కాపాడడంతోపాటు తిరుమలకు వచ్చే భక్తులకు అన్ని రకాల సౌకర్యాలు కల్పించేందుకు చర్యలు తీసుకుంటామన్నారు. కార్యక్రమంలో పెద్దాపురం ఎమ్మెల్యే నిమ్మకాయల చినరాజప్ప, టీడీపీ జిల్లా అధ్యక్షుడు జ్యోతుల నవీన్, జగ్గంపేట నియోజకవర్గ ముఖ్య నాయకులు పాల్గొన్నారు.



పూజల్లో పాల్గొన్న టీటీడీ పాలక మండల సభ్యుడు జ్యోతుల నెహ్రూ

ఏవోపై చర్యలు తీసుకోకపోతే మూకుమ్మడిగా దేనికైనా సిద్ధం

డీఎల్‌పీవోకి తేల్చి చెప్పిన పంచాయతీ కార్యదర్శులు

కార్పొరేషన్(కాకినాడ), నవంబరు 8(ఆంధ్రజ్యోతి): కాకినాడ డివిజనల్ పంచాయతీ కార్యాలయంలో ఏవోగా పనిచేస్తున్న సీహెచ్ వెంకటరెడ్డి చర్యలకు విసుగు చెందిన పంచాయతీ కార్యదర్శులు మూకుమ్మడిగా డివిజనల్ పంచాయతీ కార్యాలయానికి శుక్రవారం చేరుకున్నారు. డీఎల్‌పీవో అమ్మాజీతో వారి సమస్యలు చెప్పుకున్నారు. ఏవో కాకినాడ డివిజన్‌లో పనిచేస్తే ఇక్కడ పనిచేయడానికి ఎవరూ సిద్ధంగా లేరని కార్యదర్శుల అసోసియేషన్ జిల్లా ప్రెసిడెంట్ జొన్నాడ నరసింహారావు డీఎల్‌పీవోకి తేల్చిచెప్పారు. కులవివక్ష చూపిస్తున్నారని ఎస్సీలపై కక్షసాధింపు చర్యలు చేస్తున్నారన్నారు. ఆయనే పంచాయతీ కార్యదర్శులపై ఫిర్యాదులు చేయించి ఆయనే సెటిల్‌మెంట్లు చేస్తున్నారని వివరించారు. మహిళలని చూడకుండా మహిళా కార్యదర్శుల వస్త్రధారణపై నోటికి వచ్చినట్లు కామెంట్స్ చేస్తున్నారని, లైంగికంగా మహిళలను వేధిస్తున్నారని తెలిపారు. కూటమి ప్రభుత్వంలో కూడా గతప్రభుత్వం తరహాలోనే ఆయన వ్యవహరిస్తున్నారని అందుకు రిటైర్డ్ అయిన ఉద్యోగులను సైతం ఉపయోగించుకుంటూ దందాలు కొనసాగిస్తున్నారని తెలిపారు. పరిస్థితి ఇలాగే కొనసాగితే కార్యదర్శులు మూకుమ్మడిగా దేనికైనా సిద్ధంగా ఉన్నామని తేల్చిచెప్పారు. దీనిపై స్పందించిన డీఎల్పీవో అమ్మాజీ సోమవారం ఏవోతో మాట్లాడి విషయాన్ని డీపీవోకు తెలియజేస్తానని సమయమనం పాటించాలన్నారు. డీఎల్‌పీవోతో కార్యదర్శులు మాట్లాడుతున్న సమయంలో ఏవో వెంకటరెడ్డి ఆ విషయాన్ని గ్రహించి నెమ్మదిగా అక్కడినుంచి ఉడాయించారు. డీపీవోతో మాట్లాడడానికి అసోసియేషన్ సభ్యులు, కార్యదర్శులు వెళ్లగా అక్కడ డీపీవో లేకపోవడంతో ఏవో సుబ్బారావుతో మాట్లాడి ఆడియో రికార్డులను ఆయనకు వినిపించారు. ఏవో వ్యవహారంపై ప్రతికల్లో కథనాలు వచ్చినా ఆయన్ను బదిలీ చేయకపోవడంపై విమర్శలు వస్తున్నాయి.

ఎమ్మెల్సీ ఎన్నికల నోడల్ అధికారిగా జడ్పీ సీఈవో 6

ఎటువంటి చర్చ లేకుండా ముగిసిన స్థాయీ సంఘాల సమావేశాలు 6


వరి పంట

కారడవిలో.. కృషీవలురు

- చింతూరు, ఆంధ్రజ్యోతి


నువ్వుల సాగు


చెరువు నిర్మాణ పనులకు కలసికట్టుగా వెళుతున్న ఆదివాసీ మహిళలు

కష్టాలకు ఎదురొడ్డి నిలిచారు. చెట్ల నీడనే ఆవాసాలుగా మలచుకున్నారు. బురద నీటితో గొంతు తడుపుకున్నారు. కడుపు నింపుకోడానికి కట్టెల సేకరణే ఉపాధిగా మలచుకున్నారు. ఆకలి మంటను నూకల జావతో చల్లార్చుకున్నారు. అయితేనేమి మొక్కవోని దీక్ష వారిది. ఒక్కో అడుగు ముందుకేశారు. కష్టపడ్డారు. చెమటోడ్చారు. ఫలితం కనిపించింది. ఇపుడు వారంతా సిరులు పండిస్తున్నారు. ఎందరికో ఆదర్శమయ్యారు. ఇది అల్లిగూడెం ఆదివాసీల విజయగాథ.

అల్లిగూడెం వాసులు సొంతంగా నిర్మించుకున్న చెరువు






అల్లిగూడెం గ్రామస్తులందరూ చెరువు పనిలో శ్రమదానం.. వలస ఆదివాసీలు సొంతంగా నిర్మించుకున్న ఇల్లు

నాడు కట్టెలమ్ముకొని కడుపునింపుకున్నారు.. నేడు సిరులు పండిస్తున్నారు

ప్రతి నీటి బొట్టుని ఒడిసిపడుతున్నారు.. అల్లిగూడెం వలస ఆదివాసీల విజయగాథ

ఇదొక చిన్న కుగ్రామం. కేవలం 60 కుటుంబాలు నివాసం ఉండే గిరిజన పల్లె అది. కానీ వారి కృషి మాత్రం స్ఫూర్తివంతమైంది. వలస జీవులుగా వచ్చిన వారంతా ఎన్నో కష్టాలు పడ్డారు. ఎంతో స్వేదం చిందించారు. అయినా గానీ ముందుకే నడిచారు. అనుకున్నది సాధించారు. ఇప్పటికీ ఊరంతా కలిసి ఒకే మాట.. ఒకే మాటగా సాగుతున్నారు. ఆ కథేంటంటే.. నాలుగు దశాబ్దాల కిందట ఛత్తీస్‌గఢ్, ఒడిస్సాల నుంచి పలు ఆదివాసీ కుటుంబాలు అల్లూరి సీతారామరాజు జిల్లా చింతూరుకు వలస వచ్చాయి. అక్కడ వారికి సాగుభూమి లేకపోవడం, జీవనోపాధి కష్టతరంగా మారడడంతో వారంతా ఇక్కడకు వలస రావాల్సి వచ్చిందని చెప్పేవారు. చింతూరుకు పది కిలోమీటర్ల దూరంలో ఉన్న అల్లిగూడెంలో చెట్ల కింద, గుడారాలు వేసుకుని కొంతకాలం జీవనం సాగించారు. ఈ సమయంలో అటవీ ప్రాంతంలో చిన్న చిన్న కట్టెలను సేకరించి పది కిలోమీటర్ల దూరంలో ఉన్న చింతూరుకు నడిచి వచ్చి విక్రయించేవారు. ఆ కొద్దిపాటి ఆదాయంతో పొట్టపోసుకునేవారు. తర్వాత అల్లిగూడెంలోనే స్థిరనివాసం ఏర్పాటుచేసుకుని అదే ప్రాంతంలో పోడుసాగుకు ఉపక్రమించారు. ఈ విషయం తెలుసుకున్న అటవీ అధికారులు వారిపై కేసులు నమోదు చేశారు. దీంతో వారిలో పలువురు జైళ్లపాలు కావాల్సి వచ్చింది. అయినా వారు వెరువలేదు. చావైనా బతుకైనా ఇక్కడేనని భీష్మించారు. బతుకుపోరులో ఎన్నో కష్టాల్ని నష్టాల్ని భరించారు. తినడానికి తిండిలేని రోజుల్ని చూశారు. ఉండటానికి గూడు లేదు.. చెట్ల నీడే ఆవాసాలు. చివరకు అంతా కలిసి వ్యవసాయం చేయడమే జీవనంగా భావించారు. మగవారంతా భూమి చదును పనిలో పడ్డారు. ఇక కట్టెలమ్మడం మహిళల వంతు. అందుకు కాలినడకన ప్రతి రోజూ చింతూరు రావాల్సి వచ్చేది. ఇట్లా రోజులు, నెలలు కాదు ఏళ్ల తరబడి సాగిన జీవనయాత్ర ఇది. మొత్తంమీద నేలను సాగుకు అనుకూలంగా మలచుకున్నారు. అంతా చేతుల కష్టమే. ఇక మిగిలింది కాసింత గూడు. చేతిలో చిల్లిగవ్వలేదు. అయినా లక్ష్యపెట్టలేదు. ఉమ్మడి కష్టంతో ఇళ్లు నిర్మించుకున్నారు. సాగూ మొదలు పెట్టారు. అయితే నీటి కొరతతో పడ్డ కష్టం చేతికందకుండా పోయేది. దీంతో ఆ సమస్యను అధిగమించాలనుకున్నారు. దీంతో ఊరంతా ఒక్కటై సొంతంగా చెరువులు తవ్వుకున్నారు. వర్షం నీటిని తమ తమ చెరువుల్లోకి వచ్చిపడేలా కాలువలు తవ్వుకున్నారు. చెరువులు నిండాయి. పంటలు పండించారు. చెరువుల్లో చేపలు విడిచారు. ఇప్పుడు ఊరిలో నలభైకిపైనే చెరువులున్నాయి. ప్రతి కుటుంబానికి రెండు, మూడెకరాల పొలం సాగు చేస్తున్నారు. ఇప్పుడిప్పుడే ఈ పల్లెకు కనీస సౌకర్యాలు కల్పిస్తున్నారు. వీరు పిల్లలను చదివించుకుంటున్నారు. కానీ.. ఈ పొలాలు అటవీ భూములు కావడడంతో పట్టాలు లేవు. వలస జీవులు కావడంతో కుల ధ్రువీకరణ పత్రాల్లేవు. వీటికోసం వీరంతా పోరాడుతున్నారు.


కాకినాడ జీజీహెచ్‌లో హరేకృష్ణా మూమెంట్ సంస్థ ఆధ్వర్యంలో ఏర్పాటుచేసిన భోజన సదుపాయం

అన్నార్తులకు 'అక్షయపాత్రే'

కాకినాడ జీజీహెచ్‌లో హరేకృష్ణా మూమెంట్ సంస్థ ఆధ్వర్యంలో 'సుభోజనం'

నిత్యం రెండు వేల మంది రోగులు, సహాయకులకు ఉచితంగా భోజనం

(ఆంధ్రజ్యోతి- కాకినాడ జీజీహెచ్)

కాకినాడ ప్రభుత్వ సామాన్య ఆస్పత్రి.. గోదావరి జిల్లాలతోపాటు విశాఖ సరిహద్దు ప్రాంతాల వారికి ఆరోగ్య వరప్రదాయిని. జీజీహెచ్‌కు వైద్యచికిత్సల కోసం నిత్యం వేలాదిమంది రోగులు వస్తుంటారు. ఇక్కడికి వచ్చేవారంతా మధ్యతరగతి, నిరుపేదలే. వీరు హోటళ్లకువెళ్లి డబ్బులు ఖర్చుచేసి భోజనం చేసే పరిస్థితి ఉండదు. వీరి పరిస్థితిని గమనించిన హరేకృష్ణా మూవెంట్ సంస్థ ఉచితంగా సుభోజనం పేరిట కమ్మని భోజనం అందిస్తోంది. హరేకృష్ణా మూమెంట్ సంస్థను భక్తి వేదాంత ప్రభుపాద స్వామి స్థాపించారు. ఒకరోజు బెంగళూరులో భవనం పైఅంతస్తులో కూర్చొని కిటికీలో నుంచి కిందకు తొంగి చూస్తుండగా అక్కడ జరిగిన సంఘటన అక్షయపాత్ర ఏర్పాటుకు బీజం పడింది. రోడ్డు పక్కన పడేసిన విస్తర్లు, ఆకుల్లో ఉన్న ఆహారంకోసం బాలురు, కుక్కలు పోట్లాడుకోవడాన్ని చూసి ఆయన చలించిపోయారు. నిరుపేదల ఆహారం కోసం పడుతున్న ఇబ్బందులు భవిష్యత్తులో ఎక్కడా పడరాదని, ముఖ్యంగా విద్యార్థులు, అన్నార్తులకు ఈ స్థితి ఉండకూడదని భావించారు. హరేరామ్ మూమెంట్ సంస్థ ఉన్న ప్రదేశం నుంచి పది కిలోమీటర్ల పరిధిలో ఏ వ్యక్తి ఆకలితో అలమటించరాదనే ఆశయంతో 2000 సంవత్సరంలో అక్షయపాత్రను బెంగళూరులో తొలుత 1500 మంది విద్యార్థులకు భోజనం అందించే కార్యక్రమాన్ని భక్తి వేదాంత ప్రభుపాదస్వామి ప్రారంభించారు. ఇలా మొదలైన ఈ మూమెంట్ ఇప్పుడు అన్నిచోట్లా విస్తరించింది. మన ప్రాంతంలో విశాఖ కేజీహెచ్‌తోపాటు కాకినాడ జీజీహెచ్‌లో అక్షయపాత్ర ఆధ్వర్యంలో సుభోజనాన్ని రోగులకు ఉచితంగా అందిస్తున్నారు. తొలుత కాకినాడ జీజీహెచ్‌లో రూ.10కే కమ్మని భోజనం ప్రారంభించిన నిర్వాహకులు దాతల సహకారంతో తర్వాత ఉచితంగా రోగులకు ఆహారాన్ని అందించి రోగులు, సహాయకుల కడుపు నింపుతున్నారు. కాకినాడ జీజీహెచ్‌లో వైద్యసేవల కోసం నిత్యం 3వేల నుంచి 3,500 మంది వరకు వచ్చి ఓపీల ద్వారా వైద్యచికిత్స పొందుతుంటారు. ఇన్‌పేషెంట్లుగా మరో 2 వేలమంది వైద్యసేవలు పొందుతుంటారు. జీజీహెచ్ ప్రాంగణంలో సర్జికల్ వార్డుల వద్ద హరేకృష్ణా మూవెంట్ ఆధ్వర్యంలో 2017లో ప్రారంభించిన సుభోజనం నిత్యం రెండు వేల మందికి ఉచితంగా అందిస్తున్నారు. ముఖ్యంగా వైద్యచికిత్సల కోసం ఆస్పత్రికి వచ్చే వారి సహాయకులు బయట తినాలంటే వంద నుంచి రూ.150 వరకు ఖర్చుపెట్టాల్సిన పరిస్థితి. ఇప్పుడు ఉచితంగా లభించడంపై సంతోషం వ్యక్తంచేస్తున్నారు. సుభోజనంలో అన్నంతోపాటు ఒక కూర, పప్పు, సాంబారు, పెరుగు వడ్డిస్తారు. దాతల సహకారాన్ని బట్టి ఒక్కోసారి ప్రత్యేక వంటకాలనూ వడ్డిస్తున్నారు.



వాడపల్లి వెంకన్న ఒక్కరోజు

ఆదాయం రూ.2.67లక్షలు


వాడపల్లి శ్రీ వేంకటేశ్వరస్వామి ఆలయంలో అష్టోత్తర పూజలు చేస్తున్న భక్తులు

ఆత్రేయపురం, నవంబరు8(ఆంధ్రజ్యోతి): కోనసీమ తిరుమల వాడపల్లి శ్రీ వేంకటేశ్వరస్వామి ఆలయంలో శుక్రవారం వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన భక్తులు దర్శించుకున్నారు. అష్టోత్తర పూజలు, నిత్యకళ్యాణాలు నిర్వహించుకుని మొక్కులు తీర్చుకున్నారు. వివిధ సేవల ద్వారా ఒక్కరోజు ఆదాయం రూ.2,67,940 లభించినట్టు ఉపకమిషనర్, ఈవో నల్లం సూర్య చక్రధరరావు తెలిపారు.

కార్తీక శనివారాల్లో భక్తులకు లఘు దర్శనమే


ఉపకమిషనర్ సూర్యచక్రధరరావు

వాడపల్లి శ్రీ వేంకటేశ్వరస్వామి ఆలయంలో కార్తీక మాసం నాలుగు శనివారాలు భక్తులకు లఘుదర్శనమే అందిస్తున్నట్టు ఉపకమిషనర్, ఈవో నల్లం సూర్యచక్రధరరావు పేర్కొన్నారు. కార్తీక శనివారాలలో భక్తుల రద్దీ అంచనాలకు మించి తరలిరావడంతో క్యూలైన్లలో భక్తులు గంటల వ్యవధి వేచి ఉంటున్నారు. వేద ఆశీర్వచనం విశిష్ట, సర్వదర్శనం, తదితర టిక్కెట్లు పొందిన భక్తులకు లఘుదర్శనం మాత్రమే అందిస్తున్న ట్లు వివరించారు. ఈ విషయాన్ని భక్తులు గమనించి సహకరించాలని కోరారు.

భీమేశ్వరుడి అన్నదాన ట్రస్టుకు రూ. 100116 విరాళం

ద్రాక్షారామ, నవంబరు8(ఆంధ్రజ్యోతి): అంబేడ్కర్ కోనసీమ జిల్లా ద్రాక్షారామ భీమేశ్వరస్వామివారి అన్నదాన ట్రస్టుకు గురువారం ఏలూరు జిల్లా ఉంగుటూరు మండలం పూళ్ల గ్రామానికి చెందిన బొండాడ కస్తూరి కుమారుడు బొండాడ సుబ్బరాజు రూ.1001116లు అందజేశారు. ఆలయ సీనియర్ సహాయకుడు సూరపురెడ్డి వెంకటేశ్వరరావు బొండాడ సుబ్బరాజు దంపతులకు స్వామివారి చిత్రపటం, ప్రసాదాలు అందజేశారు.


సుబ్బరాజు దంపతులకు స్వామివారి చిత్రపటం అందిస్తున్న సిబ్బంది



ఆంధ్రప్రదేశ్ దిగ్దర్శనం పుస్తకాన్ని ఆవిష్కరిస్తున్న మంత్రి దుర్గేష్

రాష్ట్ర సాంస్కృతిక వైభవం

పునరుద్ధరణకు కృషి

● రాష్ట్ర సాంస్కృతిక, పర్యాటక శాఖల మంత్రి కందుల దుర్గేష్

దివాన్‌చెరువు, నవంబరు 8 (ఆంధ్రజ్యోతి): ఎంతో విశిష్టత కలిగిన ఆంధ్రప్రదేశ్ సాంస్కృతిక వైభవాన్ని పునరుద్ధరించేందుకు కృషి చేస్తానని రాష్ట్ర సాంస్కృతిక, పర్యాటక శాఖల మంత్రి కందుల దుర్గేష్ అన్నారు. ఆది కవి నన్నయ విశ్వవిద్యాలయం ఆర్ట్స్, కామర్స్ కళాశాల ఆంగ్ల విభాగం, ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర సృజనాత్మక, సంస్కృతి సమితి, సెంటర్ ఫర్ ఆంధ్రప్రదేశ్ స్టడీస్ (కాప్స్) సంయుక్త ఆధ్వర్యంలో నన్నయ ప్రాంగణంలో రెండు రోజులు జరిగిన ఆంధ్రప్రదేశ్ సాంస్కృతిక వైభవం సదస్సు శుక్రవారం ముగిసింది. ముఖ్య అతిథిగా విచ్చేసిన మంత్రి దుర్గేష్ మాట్లాడుతూ ఆదికవి నన్నయ, టంగుటూరిప్రకాశంపంతులు, కందుకూరి వీరేశలింగం వంటి మహనీయులు రాజమహేంద్రవరంలో నడయాడారని, కోస్తా తీరంనాగరికతకు నెలవు అని చెప్పారు. రాష్ట్రంలో ఎన్నో కళారూపాలు ఉన్నాయని, వాటిని సినిమా వైపు మాత్రమే కాకుండా స్వీయ అభిలాషతో స్వీకరించి ఆదరించాలన్నారు. తెలుగు భాష చాలా ప్రాచీనమైనదని, దాని ఆధారాలను భద్రపరుచుకోవలసిన అవసరం ఉందన్నారు. తెలుగు భాష, సంస్కృతి, సాహిత్యాలను ప్రపంచ దేశాలకు తెలియజెప్పాలన్నారు. సంస్కృతి వైభవం కోసం కృషి చేసే విధంగా ముందడుగు వేయాలన్నారు. చరిత్రను అర్థం చేసుకుంటేనే భవిష్యత్తును నిర్మించుకోగలమన్నారు. నన్నయ విశ్వవిద్యాలయం అభివృద్ధికి పూర్తిస్థాయిలో కృషిచేస్తామన్నారు. తెలుగు విశ్వవిద్యాలయాన్ని రాజమహేంద్రవరంలో ఏర్పాటు చేసేందుకు పాటుపడతామన్నారు. ఆంధ్రప్రదేశ్ దిగ్దర్శనం, ఆంధ్రశక్తి వారి ఈట్ టూ ఫీడ్ పుస్తకాలను, వీసీ శ్రీనివాసరావు రూపొందించిన జియాలజికల్ మ్యాప్‌ను మంత్రి ఆవిష్కరించారు. రాజానగరం ఎమ్మెల్యే బత్తుల బలరామకృష్ణ మాట్లాడుతూ ప్రత్యేక నిధులు తీసుకువచ్చి విశ్వవిద్యాలయ అభివృద్ధికి కృషి చేస్తామన్నారు. కాప్స్ అధ్యక్షుడు డాక్టర్ కర్రి రామారెడ్డి, ప్రతినిధి సీహెచ్ విజయానంద ఆదిత్య, కన్వీనర్లు ఆచార్య కె.శ్రీ రమేష్, ఆచార్య డి.జ్యోతిర్మయి పాల్గొన్నారు.

కొనసాగుతున్న జిమ్నాస్టిక్స్ పోటీలు

● రెండో రోజు విజేతలు వీరే

కాకినాడ అర్బన్, నవంబరు 8: పాఠశాలల రాష్ట్ర సమాఖ్య 68వ జిమ్నాస్టిక్స్ అంతర్‌జిల్లాల పోటీలు కాకినాడ డీఎస్ఏ మైదానంలోని ఆడిటోరియంలో రెండోరోజు కొనసాగాయి. వివిధ విభాగాలు క్రీడాకారులు తమ ప్రతిభనుచాటారు.

● ఆల్‌రౌండ్ చాంపియన్‌షిప్ అండర్-14 బాలికల విభాగంలో కె.సరయు(కృష్ణా) మొదటి స్థానం, ఎస్‌కే నషీమా(గుంటూరు) రెండోస్థానం, వై.కిరణ్మయి(వైఎస్ఆర్ కడప) తృతీయస్థానంలో నిలిచారు. అండర్-17 ఆల్‌రౌండ్ చాంపియన్‌షిప్‌లో ఎస్.కీర్తన(కృష్ణా), పి.అస్మిత(గుంటూరు), ఎస్ఎల్ మధులత (తూర్పుగోదావరి) విజేతలుగా నిలిచారు.


జిమ్నాస్టిక్స్ పోటీల్లో విన్యాసాలు చేస్తున్న క్రీడాకారులు

పోలవరం జల విద్యుత్ కేంద్రంలో

స్టేరింగ్ అమరిక పనులు ప్రారంభం

దేవీపట్నం, నవంబరు 8 (ఆంధ్రజ్యోతి): పోలవరం జల విద్యుత్ కేంద్రంలో టర్బైన్ల ఏర్పాటులో కీలకమైన స్టేరింగ్‌ల అమరిక పనులు శుక్రవారం ప్రారంభమయ్యాయి. ఇందుకు 320 మెట్రిక్ టన్నుల సామర్థ్యం కలిగిన క్రాలర్ క్రేన్ వినియోగిస్తున్నారు. తొలుత ఏపీ జెన్‌కో ఎస్ఈ రామభద్రరాజు, ఈఈ వై.భీమదనరావు, ఎంఈఐఎల్ చీఫ్ ఆపరేటింగ్ ఆఫీసర్ సతీష్ బాబు అంగర, ఎలక్ట్రో మెకానికల్ విభాగం సీనియర్ మేనేజర్ మణికంఠ పాల్గొన్నారు. ఒక్కో స్టేరింగ్ 4 విభాగాలుగా ఉంటుంది. బరువు 136 మెట్రిక్ టన్నులు. విద్యుత్ ఉత్పత్తికి వినియోగించే కప్లాన్ టర్బైన్లు సమర్థవంతంగా పనిచేయడంలో ఈ స్టేరింగ్‌లు కీలక పాత్ర పోషిస్తాయి. ప్రాజెక్టులో కీలకమైన నిర్మాణ పనులను వీటి అమరిక తర్వాత తరువాత కొనసాగిస్తారు. ఎస్ఈ రామభద్రరాజు మాట్లాడుతూ... జల విద్యుత్ కేంద్రంలో స్టేరింగ్‌ల ఏర్పాటు తర్వాతే టర్బైన్లు అమరుస్తారని తెలిపారు. ప్రాజెక్టు పనులుజాప్యం కాకుండా ఉండేందుకు అన్ని పనులు సమాంతరంగా చేస్తున్నట్టు తెలిపారు. నిర్దేశించిన సమయానికి ప్రాజెక్టు పూర్తి చేయాలనే లక్ష్యంతో పని చేస్తున్నట్టు ఎంఈఐఎల్ చీఫ్ ఆపరేటింగ్ ఆఫీసర్ సతీష్‌బాబు చెప్పారు.


జలవిద్యుత్ కేంద్రం వద్ద స్టేరింగ్ అమరిక పనులు నిర్వహిస్తున్న దృశ్యాలు

ఎమ్మెల్సీ ఎన్నికలకు రాజకీయ ప్రతినిధులు సహకరించాలి

● కాకినాడ జిల్లా రెవెన్యూ అధికారి వెంకట్రావు

కలెక్టరేట్(కాకినాడ), నవంబరు 8(ఆంధ్రజ్యోతి): కాకినాడ కలెక్టరేట్ కోర్టుహాలులో వివిధ రాజకీయ పార్టీల ప్రతినిధులతో ఉపాధ్యాయ, గ్రాడ్యుయేట్ ఎమ్మెల్సీ ఎన్నికలకు సంబంధించి సమావేశం నిర్వహించారు. సమావేశంలో జిల్లా రెవెన్యూ అధికారి వెంకట్రావు మాట్లాడుతూ తూర్పుగోదావరి జిల్లా, పశ్చిమ గోదావరి జిల్లా ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఎన్నికల నిర్వహణకు ఎన్నికల సంఘం షెడ్యూల్‌ను విడుదల చేసిందన్నారు. నవంబరు 11న ఎన్నికల నోటిఫికేషన్ జారీ అవుతుందన్నారు. ఈనెల 18 వరకు నామినేషన్లు స్వీకరిస్తారన్నారు. ఈనెల 19న నామినేషన్లు పరిశీలన ఉంటుందన్నారు. ఈనెల 21న నామినేషన్లు ఉపసంహరణ చేసుకోవచ్చునన్నారు. డిసెంబరు 5న పోలింగ్, పోలింగ్ బ్యాలెట్ పేపర్ ద్వారా మాత్రమే నిర్వహిస్తారన్నారు. డిసెంబరు 9న ఓట్ల లెక్కింపు ఉంటుందన్నారు. ఈ దృష్ట్యా తూర్పు, పశ్చిమ గోదావరి ఉమ్మడి జిల్లాలో ఎన్నికల కోడ్ అమల్లో ఉంటుందన్నారు. కాకినాడ జిల్లా కలెక్టర్ రిటర్నింగ్ అధికారిగా, ఈఆర్వోగా కాకినాడ జిల్లా డీఆర్వో వ్యవహరిస్తారన్నారు. ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఎన్నికలకు సంబంధించి ఉమ్మడి తూర్పు, పశ్చిమ గోదావరి జిల్లాలో 113 మండలాల్లో మొత్తం 16,316మంది ఓటర్లు ఉన్నారన్నారు. అందులో 9642మంది పురుషులు, స్త్రీలు 6674 మంది ఉన్నారన్నారు. 116 పోలింగ్ కేంద్రాలు ఏర్పాటు చేశామన్నారు. స్పెషల్ సమ్మరీ రివిజన్ ఆఫ్ ఎలక్టోరల్ రోల్ 2025 కింద 29-10-2024న డ్రాఫ్ట్ పబ్లికేషన్ చేశామన్నారు.

కాకినాడ జిల్లాలో 16లక్షల35వేల30మంది సాధారణ ఓటర్లుగా నమోదయ్యారన్నారు. ఇందులో 8,04,834మంది పురుషులు, 8,30,002మంది మహిళలు, 190మంది ఇతరులు ఉన్నారన్నారు. 18ఏళ్లు నిండిన వారు ఎవరైనా తమ ఓటుహక్కును నమోదు చేసుకునేందుకు స్పెషల్ క్యాంపెయిన్ డేస్‌గా ఈనెల 9,10,23,24 తేదీల్లో ప్రత్యేక ఓటర్ల నమోదు కేంద్రాలు ఏర్పాటు చేశామన్నారు. బీఎల్‌వోలు ఉదయం 10గంటల నుంచి సాయంత్రం 5గంటల వరకు పోలింగ్‌స్టేషన్‌లో అందుబాటులో ఉంటారని అర్హులు తమ సమీప పోలింగ్ కేంద్రాల్లో బీఎల్‌వో వద్ద ఓటు నమోదు చేసుకోవాలన్నారు. సమావేశంలో ఆమ్‌ఆద్మీపార్టీ రామకృష్ణ, బీఎస్పీ అప్పారావు, బీజేపీ వెంకటేశ్వర రావు, టీడీపీ జయప్రకాష్, సాయిబాబా తదితరులు పాల్గొన్నారు.

ఎమ్మెల్సీ ఎన్నికల నోడల్ అధికారిగా జడ్పీ సీఈవో

ఉభయగోదావరి జిల్లాల ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఎన్నికల మోడల్ కోడ్ ఆఫ్ కాండక్ట్ (ఎంసీసీ) జిల్లా నోడల్ అధికారిగా తూర్పుగోదావరి జిల్లా జడ్పీ సీఈవో లక్ష్మణరావును నియమించారు. ఈ మేరకు కాకినాడ జిల్లా కలెక్టర్ ఉత్తర్వులను వెలువరించారు. ఎంసీసీ నోడల్ అధికారిగా ఆయన కోడ్ ఉల్లంఘనలపై చర్యలు తీసుకుంటారు.

ఎటువంటి చర్చ లేకుండా ముగిసిన

స్థాయీ సంఘాల సమావేశాలు

కాకినాడ సిటీ, నవంబరు 8(ఆంధ్రజ్యోతి) ఉపాధ్యాయ ఎమ్మెల్సీ కోడ్ అమలులో ఉన్నందున ఎటువంటి చర్చ, ఏ విధమైన తీర్మానాలు లేకుండా ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లా ప్రజాపరిషత్ స్థాయి సంఘాల సమావేశాలను ముగించారు. శుక్రవారం కాకినాడలోని జిల్లా పరిషత్ సమావేశ మందిరంలో జరిగిన 1 నుంచి 7 వరకు స్థాయి సంఘాల సంఘాల సమావే శాలకు జడ్పీ చైర్మన్ వి.వేణుగోపాలరావు, వైస్ చైర్మన్ బుర్రా అనుబాబు, వైస్‌చైర్‌పర్సన్ పద్మలత, స్థాయిసంఘ చైర్‌పర్సన్ మేరుగు పద్మావతి అధ్యక్షత వహించారు. సమావేశాల్లో జడ్పీ సీఈవో వీవీఎస్ లక్ష్మణరావు, డిప్యూటీ సీఈవో జీఎస్ రామ్‌గోపాల్, అధికారులు పాల్గొన్నారు.




సమావేశంలో జడ్పీ చైర్మన్ వేణుగోపాలరావు



సత్యదేవుని దర్శనానంతరం కుటుంబీకులతో న్యాయమూర్తి

సత్యదేవునికి పాట్నా హైకోర్టు న్యాయమూర్తి
అనుపమ చక్రవర్తి పూజలు

అన్నవరం, నవంబరు 8 (ఆంధ్రజ్యోతి): ప్రముఖ పుణ్యక్షేత్రమైన సత్యదేవుని సన్నిధికి శుక్రవారం పాట్నా హైకోర్టు న్యాయమూర్తి అనుపమ చక్రవర్తి కుటుంబ సభ్యులతో విచ్చేశారు. వారికి అధికారులు ఆలయ మర్యాదలతో ఘనస్వాగతం పలికారు. స్వామిని దర్శించుకుని ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం వేద పండితులు వేదాశీర్వచనాలు అందజేశారు.



పంపా సరోవరంలో ట్రయల్ రన్ నిర్వహిస్తున్న అధికారులు

హంస వాహనం పంటుకు ట్రయల్ రన్

అన్నవరం, నవంబరు 8 (ఆంధ్రజ్యోతి): రత్నగిరివాసుడైన సత్యదేవునికి ప్రతిఏటా క్షీరాబ్ది ద్వాదశి పర్వదినాన నిర్వహించే తెప్పోత్సవం ఈనెల 13న జరగనుంది. ఈ నేపథ్యంలో పంటుకు శుక్రవారం దేవస్థానం ఎలక్ట్రికల్, ఇంజనీరింగ్ అధికారులు ట్రయల్ రన్ నిర్వహించారు. పంటు వేగం, ఎక్కడి నుంచి ఎక్కడకు సరోవరం చుట్టూ విహరించాలనే దానిపై ఒక అవగాహనకు వచ్చారు. రెండ్రోజుల్లో ఈ పంటును హంస వాహనంగా అలంకరించి రెవెన్యూ, పోలీసు, దేవస్థానం, ఇతర శాఖల అధికారుల సమక్షంలో మరోసారి ట్రయల్ రన్ నిర్వహిస్తామని ఎలక్ట్రికల్ డీఈ సత్యనారాయణ తెలిపారు. కార్యక్రమంలో ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ రామకృష్ణ తదితరులు పాల్గొన్నారు.



పీఆర్వోకు చెక్కు అందజేస్తున్న దాత వెంకటరెడ్డి

సత్యదేవ నిత్యాన్నదాన పథకానికి
రూ.లక్ష విరాళం

అన్నవరం, నవంబరు 8 (ఆంధ్రజ్యోతి): అన్నవరం దేవస్థానంలో ప్రతిష్టాత్మకంగా నిర్వహిస్తున్న సత్యదేవ నిత్యాన్నదాన పథకానికి శుక్రవారం విశాఖపట్నానికి చెందిన కె.బాలసుబ్రహ్మణ్యం రూ.1,00,116 విరాళంగా సమర్పించారు. దాత ఈ మొత్తాన్ని చెక్కు రూపంలో ఆలయ పీఆర్వో వెంకటరెడ్డికి అందజేశారు. దాతను ఆయన అభినందించి ప్రత్యేక దర్శన సౌకర్యం కల్పించి స్వామివారి ప్రసాదం అందజేశారు.

నేటి నుంచి రామస్వామి
జయంత్యుత్సవాలు

పిఠాపురం, నవంబరు 8 (ఆంధ్రజ్యోతి): శ్రీపాద శ్రీవల్లభుల స్వామి జన్మస్థానంగా ప్రసిద్ధి గాంచిన శ్రీపాద శ్రీవల్లభ మహాసంస్థానం పీఠాధిపతి, గురువు సజ్జనగడ రామస్వామి శత జయంతి మహోత్సవాలు శనివారం



ప్రారంభం కానున్నాయి. మూడు రోజుల పాటు ప్రత్యేక పూజలు, కార్యక్రమాలు నిర్వహించనున్నారు. మహా సంస్థానం గోశాల ప్రాంగణంలో జరిగే ఉత్సవాల్లో తొలి రోజైన 9వ తేదీ ఉదయం విఘ్నేశ్వరుని పూజ, పుణ్యాహవాచనం, రుత్విక్‌వరుణ, శ్రీపాదశ్రీవల్లభ స్వామికి శత రుద్రీయ అభిషేకం, సద్గురు రామస్వామి పాదుకలకు అభిషేకం, పూజ జరుగుతాయి. సాయంత్రం హోమం, చతుర్వేత స్వస్తి. 10వ తేదీ శ్రీపాద శ్రీవల్లభులు, సజ్జనగడ రామస్వామి దివ్య పాదుకలకు శత రుద్రీయ అభిషేకం, హోమం, నీరాజన మంత్రపుష్పాలు, చతుర్వేద స్వస్తి. 11వ తేదీన సద్గురు రామస్వామి శతజయంతి సందర్భంగా శ్రీపాదులు, రామస్వామి దివ్యపాదులకు అభిషేకాలు, పూజ, హోమం, పూర్ణాహుతి, నీరాజన మంత్రపుష్పాలు, చతుర్వేద స్వస్తి, మహదాశీర్వచనం నిర్వహిస్తారు. భక్తులు తరలివచ్చి శ్రీపాదశ్రీవల్లభులు, సజ్జనగడ రామస్వామి గురువర్యుల అనుగ్రహానికి పాత్రులు కావాలని మహా సంస్థానం కార్యనిర్వహణాధికారి ఆర్.సౌజన్య కోరారు. జయంత్యుత్సవాలకు విచ్చేసే భక్తుల కోసం ఏర్పాట్లు చేస్తున్నామని ఆమె చెప్పారు.

కూటి కోసం వెళ్లి... కానరాని లోకాలకు..

- ఒకరిని కాపాడబోయి... మునిగిపోయిన మరో ముగ్గురు...
- నలుగురి గల్లంతుతో రోడ్డునపడ్డ రెండు కుటుంబాలు
- ఇద్దరి మృతదేహాలు లభ్యం
- అల్లూరి జిల్లా అడ్డతీగల మండలం బొంగరాలపాడు ఏలేరు వాగులో ఇసుక తీస్తుండగా దుర్ఘటన
- ఏలేశ్వరం మండలం తూర్పు లక్ష్మీపురంలో విషాదఛాయలు



సంఘటనాస్థలంలో గల్లంతైన వారి కోసం గాలింపు



బాధిత కుటుంబాన్ని ఓదారుస్తున్న ప్రత్తిపాడు ఎమ్మెల్యే సత్యప్రభ

అడ్డతీగల/ఏలేశ్వరం/తాళ్లపూడి, నవంబరు 8(ఆంధ్రజ్యోతి): కాకినాడ జిల్లా ఏలేశ్వరం మండలం తూర్పులక్ష్మీపురం గ్రామానికి చెందిన వీరమళ్ల భూషణం(60), అతడి కుమారుడు వీరమళ్ల జయబాబు(26), అతడి అల్లుడు తూర్పుగోదావరి జిల్లా తాళ్లపూడి మండలం అన్నదేవర పేటకు చెందిన బేదంపూడి చిన్నగొంతియ్యతోపాటు తూర్పులక్ష్మీపురానికి చెందిన మరో వ్యక్తి చింతా శ్రీనివాస్(19) కూలి పనులు చేస్తుంటారు. తూర్పులక్ష్మీపురం గ్రామానికి అడ్డతీగల మండలం బొంగరాలపాడు ఏలేరువాగు దగ్గర్లోనే ఉంటుంది. అక్కడ ఇసుక తవ్వకం పనులకు వెళ్లి ఉపాధి పొందుతుంటారు. ఇసుక తవ్వి దాన్ని ట్రాక్టర్లలో లోడింగ్ చేసి పరిసర ప్రాంతా లకు తరలించే పనిచేస్తుంటారు. ఇక్కడ ఇసుక ర్యాంపునకు అనుమతి లేదు. కొన్నాళ్ల క్రితం ఈ ప్రదేశంలో ఇసుక తవ్వకాలు జోరుగా జరిగాయి. దీంతో అక్కడ గుంతలు ఏర్పడ్డాయి. ఇటీవల వర్షాలకు ఆ ప్రాంతమంతా నీరు ఎక్కువగా చేరి ఆ గుంతలు బురదతో నిండి ఊబి మాదిరిగా మారాయి. ఈ నేపథ్యంలో ఆ వాగులో ఇసుక తీసే ప్రాంతంలో ప్రమాదకరంగా ఉంది. కాగా శుక్రవారం కూడా అదే మాదిరిగా ఇసుకతీత పనినిమిత్తం అక్కడకు చేరుకున్నారు. కానీ, అక్కడ గుంతలు ఏర్పడిన విషయం గ్రహించలేకపోయారు.మధ్యాహ్నం ముగ్గురూ ఇసుకతీతకోసం వాగులోకి దిగారు. ఒడ్డునే ట్రాక్టర్ కూడా ఉంది. మళ్లీ వాగు లోపలికి వెళ్లగా తొలుత ఒకరు ప్రమాదవశాత్తూ లోపలికి మునిగిపోతున్నారు. అతడ్ని కాపాడే ప్రయత్నంలో మరొకరు.. తర్వాత ఇంకొకరు ఇలా నలుగురూ వాగులో మునిగిపోయారు. అంతా క్షణాల్లో జరిగిపోయింది. ఒకరిని కాపాడేందుకు వెళ్లి మరో ముగ్గురు కలిసి మొత్తం నలుగురు గల్లంతయ్యారు. ఇసుక తవ్వకాలకు వెళ్లి గల్లంతైన నలుగురూ పేద కుటుంబానికి చెందినవారు. ప్రమాద సమాచారం తెలిసిన వెంటనే తూర్పులక్ష్మీపురం నుంచి బంధువులు బొంగరాలపాడు సంఘటనా స్థలానికి బయలుదేరి వెళ్లిపోయారు. సాయంత్రానికి తిరిగి వచ్చేస్తానని చెప్పిన వారికి ఇలా జరగడంతో వారు రోధిస్తున్న తీరు కంటతడి పెట్టించింది.

బావ, బావమర్దుల మృతదేహాల వెలికితీత

అప్పటికే సమాచారం అందుకున్న పోలీసులు, డివిజన్ అధికారులు వెంటనే సంఘటనా స్థలానికి చేరుకున్నారు. వీరిలో రంపచోడవరం సబ్ కలెక్టర్ కల్పశ్రీ, డీఎస్పీ సాయిప్రశాంత్ పరిసరాలను పరిశీలించి ఎన్‌డీఆర్‌ఎఫ్ బృందాలతో గాలింపు చర్యలు చేపట్టాలని అధికారులను ఆదేశించారు. వెంటనే ఆయా బృందాలు రంగంలో దిగి వలల సహాయంతో వీరమళ్ల జయబాబు, బేదంపూడి గొంతియ్య మృతదేహాలు వెలికితీశాయి. సంఘటనాస్థలాన్ని ఎమ్మెల్యే మిరియాల శిరీషదేవి వెళ్లి పరిస్థితిని పర్యవేక్షించారు.

ఎమ్మెల్యే సత్యప్రభ పరామర్శ

ఏలేరు వాగులో గల్లంతైన బాధితుల కుటుంబానికి సంఘటనాస్థలానికి వెళ్లి ప్రత్తిపాడు ఎమ్మెల్యే వరుపుల సత్యప్రభ ఓదార్చారు. ఆమె స్పందిస్తూ దుర్ఘటన జరగడం చాలా బాధాకరమని, వీలైనంత త్వరగా మృతదేహాలను వెలికి తీయాలని అధికారులకు సూచించారు. బాధితుల కుటుంబాలకు అండగా ఉంటామన్నారు.

చదువు ఆపేసి.. పనులకు వెళ్తూ...

ఇదే గ్రామానికి చెందిన చింతా గోపి, సత్యవతి దంపతులకు కుమారుడు శ్రీనివాస్(16). అతడికి దుర్గ అనే సోదరుడు, భూమిక అనే సోదరి ఉంది. అతడు ఇటీవలే ఏలేశ్వరం ప్రభుత్వజూనియర్ కళాశాలలో ఇంటర్ మొదటి సంవత్సరం ప్రవేశం పొంది మధ్యలో చదువు ఆపేశాడు. కుటుంబపోషణకు కూలీ పనికి వెళ్తుంటాడు. భూషణం వెంట శ్రీనివాస్ కూడా వెళ్లి వాగులో గల్లంతు కావడంతో కుటుంబ సభ్యుల్లో విషాదం నింపింది.

ఒకే కుటుంబం... అతలాకుతలం

ఏలేశ్వరం మండలం తూర్పులక్ష్మీపురం గ్రామానికి చెందిన వీరమళ్ల భూషణం, వీరమళ్ల జయబాబు, తూర్పు గోదావరి జిల్లా తాళ్లపూడి మండలం అన్నదేవరపేటకు చెందిన బేదంపూడి చిన్నగొంతియ్య ముగ్గురూ ఒకే కుటుంబానికి చెందినవారు. ఒకే కుటుంబంలో తండ్రి, కొడుకు, అల్లుడు ఇలా కావడంతో ఆ కుటుంబం దిక్కుతోచని స్థితిలో పడింది. వీరమళ్ల భూషణం కుమారుడు జయబాబు. వీళ్లు రోజువారీ కూలి పనులకు వెళ్తుంటారు. వీరివెంట బేదంపూడి చినగొంతియ్య కొన్నాళ్లుగా పనులకు వెళ్తున్నాడు. అతడు గతంలో తన స్వగ్రామంలో పెయింటింగ్ పనులు చేసేవాడు. ఇటీవల అతడి భార్య భారతిని ప్రసవానికి ఆమె పుట్టింటికి తీసుకువెళ్లాడు. అక్కడ అతనికి కొడుకు పుట్టాడు. అక్కడే తనమామ, బావమరిదితో పనులకు వెళ్తున్నాడు. ఈ తరుణంలో శుక్రవారం ఇసుకతీత, లోడింగ్ పనికి వెళ్లాడు. అక్కడ అనుకోకుండా జరిగిన ప్రమాదంలో మునిగిపోతున్నవారికి సహాయం చెయ్యబోయి గల్లంతయ్యాడు. దీంతో కుటుంబం అతలాకుతలమైంది.

రాష్ట్ర ప్రభుత్వ అవార్డుకు సామర్లకోట ఉర్దూ ఉపాధ్యాయుడి ఎంపిక



సయ్యద్ సైఫులా

సామర్లకోట, నవంబరు 8(ఆంధ్రజ్యోతి): సామర్లకోటలో అగస్థానా మున్సిపల్ ప్రాథ మిక పాఠశాల ఉర్దూ పాఠాలు బోధించే ఎస్‌జీటీ ఉర్దూ పండిట్ సయ్యద్ సైఫుల్లా రాష్ట్ర ప్రభుత్వం ఉత్తమ ఉర్దూ ఉపాధ్యాయుడిగా ప్రభుత్వ అవార్డుకు ఎంపిక చేస్తూ శుక్రవారం రాత్రి అమరావతి నుంచి ఏపీ రాష్ట్ర ఉర్దూ అకాడమీ (విజయవాడ) సంచాలకుల నుంచి ఉత్తర్వులు జారీ చేశారు. నవంబరు 11 మౌలానా అబుల్ కలాం అజాద్ జయంతి పురస్కరించుకుని ఏటా రాష్ట్ర ప్రభుత్వం నిర్వహించనున్న ఒక ప్రత్యేక కార్యక్రమంలో ఈ అవార్డులు అందజేయడం జరుగుతుంది. ఈ అందులో భాగంగా ప్రభుత్వం ఈ పురస్కారానికి సయ్యద్ సైఫులాను ఎంపిక చేసింది. 24ఏళ్ల ఉర్దూ పండిట్‌గా సామర్లకోట మున్సిపల్ పాఠశాలలో ఆయన పనిచేస్తున్నారు. ఈనెల 11న విజయవాడ తుమ్మలపల్లి కళాక్షేత్రంలో అవార్డు అందుకోనున్నారు.

సెలవులోకి కాకినాడ జేసీ

కలెక్టరేట్(కాకినాడ), నవంబరు 8(ఆంధ్రజ్యోతి): కాకినాడ జేసీ రాహుల్‌మీనా వ్యక్తిగత పనులపై సెలవులోకి వెళ్లారు. వచ్చే బుధవారం జిల్లాలో ఆయన తిరిగి అందుబాటులోకి వస్తారని కలెక్టరేట్ అధికారులు తెలిపారు. ఇన్‌ఛార్జి జేసీగా డీఆర్వో వెంకట్రావు బాధ్యతలు నిర్వహిస్తారు.

భర్త ఇంటి వద్ద మౌన పోరాటం

తనను, పిల్లలను వదిలేశాడని ఆవేదన

వేరే మహిళతో సహజీవనం చేస్తున్నాడని ఆరోపణ

పవన్ కల్యాణ్ న్యాయం చేయాలని వినతి



భర్త ఉంటున్న ఇంటి ఎదుట ఇద్దరు పిల్లలతో కలిసి మౌన పోరాటానికి దిగిన సౌమ్యలక్ష్మి

పిఠాపురం, నవంబరు 8 (ఆంధ్రజ్యోతి): వేరే మహిళతో సహజీవనం చేస్తూ తనను వదిలించుకోవాలని చూస్తున్నాడని, ఇద్దరు పిల్లలకు అన్యాయం చేస్తున్నాడని ఆవేదన వ్యక్తం చేస్తూ ఇద్దరు కుమార్తెలతో కలిసి ఒక మహిళ కాకికాడ జిల్లా పిఠాపురంలోని భర్త ఇంటి ఎదుట మౌన పోరాటానికి దిగింది. తన భర్త తనకు కావాలని, పిల్లలను అన్యాయం చేయవద్దని ఆమె కోరింది. మహిళ తల్లిదండ్రులు పెంకే త్రిమూర్తులు, సరస్వతి తెలిపిన వివరాల ప్రకారం.. డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లా కపిలేశ్వరపురం మండలం వెదురుమూడి గ్రామానికి చెందిన పెంకే సౌమ్యలక్ష్మికి రాజమహేంద్రవరం లలితానగర్‌కు చెందిన విత్తనాల రామలక్ష్మణకుమార్‌తో 2017లో అన్నవరంలో వివాహమైంది. పెళ్లయిన నాటి నుంచి భర్త, అత్తమామలు తరచూ అదనపు కట్నం కోసం వేధింపులకు గురిచేస్తుండడంతో అంగర పోలీసుస్టేషన్లో గతంలో ఫిర్యాదు చేశారు. అనంతరం కూడా వారు వేధింపులు ఆపలేదు. వీరికి ఇద్దరు కుమార్తెలు ఉన్నారు. ఈలోగా రామలక్ష్మణకుమార్ పిఠాపురం పట్టణంలోని వైఎస్‌ఆర్ గార్డెన్స్‌లో వేరే మహిళతో సహజీవనం చేయడం ప్రారంభించాడు. పిల్లలకు అన్యాయం చేయవద్దని కలిసి ఉందామని తన కుమార్తె కోరినా అల్లుడు పట్టించుకోలేదని ఆవేదన వ్యక్తం చేశారు. భర్త ఎంతకూ పట్టించుకోకపోవడంతో సౌమ్యలక్ష్మి తనకు భర్త కావాలంటూ, తన పిల్లలకు తండ్రి కావాలంటూ వైఎస్సార్ గార్డెన్స్‌లో భర్త ఉంటున్న ఇంటి ఎదుట శుక్రవారం ఆందోళనకు దిగింది. చేపట్టింది. భర్త తనను, పిల్లలకు కాపురానికి తీసుకువెళ్లేవరకూ మౌన పోరాటం విరమించేది లేదని స్పష్టం చేశారు. కాగా భర్త పట్టించుకోకపోవడంతో తన కుమార్తె సౌమ్యలక్ష్మి, ఇద్దరు కుమార్తెలు (5,6 ఏళ్లవయసు) అనాథలుగా మారారని తల్లిదండ్రులు ఆవేదన వ్యక్తం చేశారు. డిప్యూటీ సీఎం పవన్‌కల్యాణ్ తమకు న్యాయం చేయాలని వారు విజ్ఞప్తి చేశారు. పిల్లలతో కలిసి సౌమ్యలక్ష్మి చేపట్టిన ఆందోళనకు కాకినాడ టీడీపీ మహిళా నేత సత్యభామ, జనసేన వీరమహిళ వెంకటలక్ష్మి, కుంచే మణి సంఘీభావం ప్రకటించారు.



ఎఫ్ఎల్ఎన్ శిక్షణలో కృత్యాన్ని పరిశీలిస్తున్న కోనసీమ డీఈవో సలీంబాషా

విద్యార్థులతో మమేకమై బోధించాలి

దివాన్‌చెరువు, నవంబరు 8 (ఆంధ్రజ్యోతి): ఉపాధ్యాయులు విద్యార్థులతో మమేకమై వారి స్థాయికి వెళ్లి విద్యా బోధన చేయాలని, అప్పుడే అభ్యసనా సామర్థ్యాలను చేరుకునే అవకాశం ఉంటుందని డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లా డీఈవో షేక్ సలీంబాషా అన్నారు. తూర్పు గోదావరి జిల్లా రాజానగరం మండలం కొండగుంటూరులో ఎఫ్ఎల్ఎన్ శిక్షణ కేంద్రాన్ని శుక్రవారం ఆయన సందర్శించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ఉపాధ్యాయులు ఆటపాటలతో కూడిన విద్యను అందించేందుకు ఎఫ్ఎల్ఎన్ శిక్షణ దోహదం చేస్తుందన్నారు. ఉపాధ్యాయులు చేస్తున్న యాక్టివిటీస్‌ను ఆయన స్వయంగా పరిశీలించి సంతృప్తి వ్యక్తం చేశారు. శిక్షణా కేంద్రం వెన్యూ ఇన్‌చార్జి పి.రాంబాబు ఉపాధ్యాయులు శిక్షణ పొందుతున్న విధానాన్ని డీఈవోకు వివరించారు. ఉపాధ్యాయుల నుంచి డీఈవోఫీడ్ బ్యాక్ తీసుకున్నారు. డీఈవో వెంట కోనసీమ జిల్లా సమగ్ర శిక్షా సీఎంవో బీవీవీ సుబ్రహ్మణ్యం, రాష్ట్ర పరిశీలకుడు అరవ ప్రభాకర్, ఏపీ ఓపెన్ స్కూల్ జిల్లా కో-ఆర్డినేటర్ పి.సాయి వెంకటరమణ ఉన్నారు.

బాలికను మోసగించిన ఆటో డ్రైవర్ అరెస్టు

ప్రత్తిపాడు, నవంబరు 8 (ఆంధ్రజ్యోతి): ఎనిమిదో తరగతి చదువున్న బాలికకు మాయమాటలు చెప్పి లోబరుచుకున్న ఆటో డ్రైవర్‌ను ప్రత్తిపాడు పోలీసులు శుక్రవారం అరెస్టు చేశారు. దీనికి సంబంధించి సీఐ బి.సూర్యఅప్పారావు తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి... కాకినాడ జిల్లా ప్రత్తిపాడు మండలంరాచపల్లికి చెందిన ఆటో డ్రైవర్ పెదిరెడ్డి కృపారాజు తన కుమార్తె, కుమారుడులతో పాటు అదే గ్రామానికి చెందిన 8వ తరగతి బాలికను రోజూ స్కూలుకు తీసుకెళ్లేవాడు. ప్రేమిస్తున్నాను, పెళ్ళి చేసుకుందామని మాయమాటలు చెప్పి లోబరుచుకున్నాడు. గత నెల 30న బాలికను తీసుకుని ధర్మవరం, రాజమహేంద్రవరం, భీమవరం, కాకినాడ పరిసర ప్రాంతాల్లో తిప్పుతూ పలుసార్లు శారీరక సంబంధం పెట్టుకున్నాడు. తొలుత బాలిక తల్లిదండ్రులు తమ కుమార్తె కనిపించట్లేదని పోలీస్ స్టేషన్లో ఫిర్యాదు చేయడంతో కేసు నమోదు చేశారు. అయితే ఆ బాలిక తల్లిదండ్రుల వద్దకు చేరుకుంది. తహసీల్దారు వద్ద జరిగిన సంఘటనలను వివరించింది. దీంతో ఎస్పీ విక్రాంత్ పాటిల్ ఆదేశాల మేరకు పెద్దాపురం ఎస్‌డీపీవో బి.శ్రీహరిరాజు దర్యాప్తు నిర్వహించి నిందితుడు కృపారాజుపైపోక్సో కేసు నమోదు చేశారు. నిందితుడిని పట్టుకునేందుకు డీఎస్పీ ప్రత్యేక బృందాలు ఏర్పాటు చేశారు. ఈ నెల 7న ధర్మవరం గ్రామ శివారున అరెసుట చేసి కోర్టులో హాజరుపర్చగా మేజిస్ట్రేట్ రిమాండ్ విధించారు. త్వరితగతిన విచారణ పూర్తి చేసి బాలిక ఆచూకీ కనుగొని నిందితుడిని అరెస్టు చేసి రిమాండ్‌కు పంపడంలో కృషి చేసిన పెద్దాపురం డి.శ్రీహరిరాజు, ప్రత్తిపాడు సీఐ సూర్యఅప్పారావు, ఎస్ఐ లక్ష్మీకాంతంలను ఎస్పీ అభినందించారు.

భర్తపై అలిగి... శవమై తేలి

పోలవరం కాలువలో మహిళ మృతదేహం అభ్యం



ఏసమ్మ (పాత చిత్రం)

జగ్గంపేట, నవంబరు 8 (ఆంధ్రజ్యోతి): కాకినాడ జిల్లా జగ్గంపేట-గోకవరం రోడ్డులో పోలవరం కాలువలో శుక్రవారం మహిళ మృతదేహం లభ్యమైందని ఎస్ఐ రఘునాథరావు తెలిపారు. జగ్గంపేట సత్యవేణిపేటకు చెందిన నక్క ఏసమ్మ (22)కు, అదే గ్రామానికి చెందిన వెలుగుల వీర దుర్గాప్రసాద్‌తో రెండేళ్ల క్రితం వివాహమైంది. వారికి పది నెలల బాబు ఉన్నాడు. ఏసమ్మ భర్తతో తరుచూ గొడవపడి పుట్టింటికి వెళ్లిపోయేది. సర్దిచెప్పడంతో రెండు, మూడు రోజుల తర్వాత భర్త వద్దకు వచ్చేది. ఈ నెల 6వ తేదీ సాయంత్రం జగ్గంపేట సెంటర్లో పానీపూరీ తిన్న తర్వాత భర్తను సినిమాకు వెళ్దామని అడిగింది. భర్త సమయం లేదని చెప్పడంతో మనస్తాపానికి గురై ఇంటి నుంచి బయటకు వెళ్లిపోయింది. ఈ విషయాన్ని దుర్గాప్రసాద్ అత్తగారికి చెప్పాడు. ఆమె కూతురు తమ ఇంటికి రాలేదని చెప్పింది. కోపం తగ్గిన తర్వాత వస్తుందిలే అని చెప్పడంతో ప్రసాద్ ఎటువంటి ఫిర్యాదు చేయలేదు. ఈలోగా గ్రామానికి చెందిన వ్యక్తి పోలవరం కాలువలో మహిళ మృతదేహం కనిపించిందని ఏసమ్మ తల్లి వరలక్ష్మికి చెప్పాడు. దీంతో ఆమె పోలీసులకు విషయం తెలపగా వారు పోలవరం కాలువ వద్దకు వచ్చి మృతదేహాన్ని బయటకు తీయించారు. మృతురాలి తల్లి వరలక్ష్మి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్టు ఎస్ఐ తెలిపారు.

విహార యాత్రలో విషాదం

సోకిలేరు వాగులో కొట్టుకుపోయి యువకుడి మృతి



సత్యవరుణ్ (పాత చిత్రం)

మోతుగూడెం/మలికిపురం, నవంబరు 8 (ఆంధ్ర జ్యోతి): అల్లూరి సీతారామ రాజు జిల్లా మోతుగూడెం పరిధిలోని సోకిలేరు వాగుకు డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లా రాజోలు నుంచి నలుగురు వ్యక్తులు ద్విచక్ర వాహనంపై శుక్రవారం విహార యాత్రకు వచ్చారు. సోకిలేరు వ్యూ పాయింట్ వద్ద ఆగి సెల్ఫీలు దిగారు. అనంతరం స్నానం చేయడం కోసం వాగులోకి దిగారు. వారిలో 20 ఏళ్ల గడ్డం సత్యవరుణ్ కాలు జారి ప్రవాహ వేగానికి వాగులో కొట్టుకుపోయాడు. స్నేహితులు కాపాడే ప్రయత్నం చేశారు. వెంటనే మోతుగూడెం ఎస్ఐ శివనారాయణకు సమాచారం అందించారు. పోలీసులు హుటాహుటిన అక్కడకు చేరుకుని ఘటనా స్థలాన్ని పరిశీలించారు. లక్కవరం నుంచి గత ఈతగాళ్లను రప్పించి వెతికించారు. కొద్దిసేపటి తర్వాత ఆచూకీ లభ్యమైంది. విగత జీవిగా పడి వున్న వరుణ్‌ను ఒడ్డుకు చేర్చి చింతూరు ప్రభుత్వాసుపత్రికి తరలించారు. అక్కడ వైద్యులు పరీక్షించి అప్పటికే ప్రాణం కోల్పోయినట్టు నిర్ధారించారు. పోస్టుమార్టం నిమిత్తం మృతదేహాన్ని మార్చురీకి తరలించారు. కాగా సత్యవరుణ్‌ది మలికిపురం మండలం ఇరుసుమండ గ్రామం. ఇతడు వెటర్నరీ కోర్సు చదివినట్టు సమాచారం. వరుణ్ తన చిన్నాన్న కుమారుడు, స్నేహితులతో కలిసి చింతూరు విహార యాత్రకు వెళ్లగా వాగులో కొట్టుకుపోయి మృతి చెందాడు. ఇతడి తండ్రి బాబూరావు గల్ఫ్‌లో ఉంటున్నాడు. తల్లి అరుణప్రియ ఇరుసుమండలో ఉంటుంది. తమ్ముడు చదువుకుంటున్నాడు.



పట్టుకున్న గంజాయిని , సరఫరా చేస్తున్న వ్యక్తిని చూపిస్తున్న పోలీసులు

21 కిలోల గంజాయితో యువకుడి అరెస్టు

ప్రత్తిపాడు, నవంబరు 8 (ఆంధ్రజ్యోతి): కాకినాడ జిల్లా ప్రత్తిపాడు మండలం రాచపల్లి వద్ద 21 కిలోల గంజాయితో ఓ యువకుడిని పోలీసులు శుక్రవారం అరెస్టు చేశారు. ప్రత్తిపాడు సీఐ బి.సూర్య అప్పారావు తెలిపిన వివరాల ప్రకారం... హైదరాబాద్‌లో నివాసం ఉంటున్న సూర్యాపేట మండలం సూర్యాపేట సందు ఫైజార్‌కు చెందిన 29 ఏళ్ల కోలా మణికంఠ అలియాస్ మణిదీప్ గంజాయి తాగుతూ గంజాయి అక్రమ రవాణాకు పాల్పడుతున్నాడు. ఈ క్రమంలో ఒడిశా రాష్ట్రం మల్కన్‌గిరి జిల్లా పశుపుల్లంక అటవీ ప్రాంతం నుంచి హైదరాబాద్‌కు 21 కిలోల గంజాయి తరలిస్తున్నాడు. అతడిని రాచపల్లి గ్రామ శివారున డీఎస్పీ శ్రీహరిరాజు ఆధ్వర్యంలో సీఐ బి.సూర్యఅప్పారావు, ఎస్ఐ లక్ష్మీకాంతం అరెస్టు చేశారు. నిందితుడిని పట్టుకున్న ప్రత్తిపాడు సీఐ, ఎస్ఐలను ఎస్పీ, డీఎస్పీలు అభినందించారు.

సదరం ధ్రువీకరణాల పేరిట వసూళ్లు

వ్యక్తిని పట్టుకున్న సెక్యూరిటీ సూపర్‌వైజర్

రామచంద్రపురం (ద్రాక్షారామ), నవంబరు 8 (ఆంధ్రజ్యోతి): దివ్యాంగులకు సదరం ధ్రువీకరణ పత్రాలు ఇప్పిస్తానని వసూళ్లకు పాల్పడుతున్న వ్యక్తిని శుక్రవారం రామచంద్రపురం ఏరియా ఆసుపత్రి సెక్యూరిటీ సూపర్‌వైజర్ పలివెల శ్రీనివాసరావు పట్టుకున్నాడు. వివరాలు ఇలా ఉన్నాయి... డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లా రామచంద్రపురం ఏరియా ఆసుపత్రిలో మంగళ, శుక్రవారాల్లో నిర్వహించే సదరం క్యాంపునకు వచ్చే దివ్యాంగులకు ధ్రువీకరణ పత్రాలు చేయిస్తానని ఎం.రవికుమార్ అనే వ్యక్తి వసూళ్లకు పాల్పడుతూ మోసగిస్తున్నాడు. దీనిపై ఫిర్యాదులు రావడంతో ఆ వ్యక్తిని ఏరియా ఆసుపత్రి పర్యవేక్షకుడు డాక్టర్ ప్రవీణ్ వద్దకు తీసుకెళ్లగా ఆయన గట్టిగా నిలదీశారు. మంత్రి, తాము ఆసుపత్రి అభివృద్ధికి కృషి చేస్తుంటే వైద్యుల పేరుచెప్పి సొమ్ములు వసూలు చేస్తూ ఆసుపత్రికి చెడ్డపేరు తెచ్చేలా చేస్తున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. ఈ విషయాన్ని పోలీసులు, మంత్రి సుభాష్ దృష్టికి డాక్టర్ ప్రవీణ్ తీసుకువెళ్లారు. పోలీసులు, మంత్రి సుభాష్ తండ్రి సత్యం రవికుమార్‌ను హెచ్చరించి వదిలిపెట్టారు. ఏరియా ఆసుపత్రి సమీపంలో మళ్లీ కనిపిస్తే కేసు నమోదు చేస్తామని పోలీసులు హెచ్చరించారు.

ఇంగ్లీష్ టీచర్ సస్పెన్షన్

కాకినాడ రూరల్, నవంబరు 8 (ఆంధ్రజ్యోతి): కాకినాడ జిల్లా కాకినాడ రూరల్ మండలం తూరంగి జడ్పీ ఉన్నత పాఠశాలలో ఇంగ్లీష్ టీచర్‌గా పని చేస్తున్న మహ్మద్ తానీషా వలీబా బాను సస్పెండ్ చేస్తూ డీఈవో పి.రమేష్ శుక్రవారం ఆదేశాలు జారీ చేశారు. ఆ ఉపాధ్యాయుడిపై ఇంద్రపాలెం పోలీస్ స్టేషన్‌లో పోక్సో చట్టం ద్వారా కేసు నమోదైంది. ఆ అభియోగాలన్నీ రుజువైన కారణంగా విధుల నుంచి సస్పెండ్ చేశామన్నారు. అయితే అతను గతంలో ఉపాధ్యాయుడిగా పనిచేసిన పాఠశాలల్లో కూడా ఈ విధంగా ప్రవర్తించాడని తెలిసింది. విద్యార్థినులకు అసభ్యకరమైన వీడియోలు చూపించేవాడని సమాచారం.

కాకినాడ

మరిడమ్మకు వెండి పుష్పాలతో అర్చన

పెద్దాపురం, నవంబరు 8 (ఆంధ్రజ్యోతి): స్థానిక మరిడమ్మ దేవస్థానంలో అమ్మవారికి బంగారు వెండి పుష్పాలతో అర్చన కార్యక్రమం శుక్రవారం నిర్వహించారు. దేవస్థానం సహాయ కమిషనర్ కె.విజయలక్ష్మీ ఆధ్వర్యంలో అమ్మవారికి ఈ అర్చన వేదపండితులు చేపట్టి అనంతరం ప్రసాదాలను వితరణ చేశారు. కార్యక్రమంలో దేవస్థానం సిబ్బంది, భక్తులు పాల్గొన్నారు.

ఖాళీ స్థలాల ఆక్రమణకు ప్రయత్నం

రాత్రికి రాత్రే చదును చేసే పనులు

అడ్డుకున్న రెవెన్యూ, పోలీసు సిబ్బంది

ఎక్స్‌కవేటర్ సీజ్



పిఠాపురం జగ్గయ్యచెరువు కాలనీలో ఉన్న ఖాళీ స్థలాలు

పిఠాపురం, నవంబరు 8(ఆంధ్రజ్యోతి): పిఠాపురం పట్టణంలోని జగ్గయ్యచెరువు కాలనీలో ఖాళీ స్థలాలను ఆక్రమించుకునేందుకు చేసిన ప్రయత్నం కలకలం సృష్టించింది. రాత్రికి రాత్రే ఎక్స్‌కవేటర్, లారీలు పెట్టి స్థలాలను చదును చేసి, ఎత్తు చేసే పనులను కొందరు వ్యక్తులు చేపట్టగా రెవెన్యూ సిబ్బంది, పోలీసులు అడ్డుకున్నారు. ఎక్స్‌కవేటర్‌ను సీజ్ చేశారు.



సీజ్ చేసిన ఎక్స్‌కవేటర్‌తో రెవెన్యూ, పోలీసు సిబ్బంది

పట్టణంలోని జగ్గయ్యచెరువు కాలనీలో గల సివిల్ సప్లైస్ గోడౌన్, ప్రభుత్వ కార్యాలయాల వెనుకభాగంలో ఖాళీ స్థలాలు ఉన్నాయి. ఇక్కడ కొంతమందికి ఇళ్ల స్థలపట్టాలు ఇవ్వగా మిగిలినవి ఖాళీగా ఉండడంతో వాటిని ఆక్రమించుకునేందుకు గతం నుంచి ప్రయత్నాలు జరిగాయి. కొందరు ఆక్రమించుకుని గృహాలు నిర్మించుకున్నా రు. గురువారం రాత్రి కొందరు ఇక్కడ ఉన్న ఖాళీ స్థలాల్లో కొన్నింటిని తమ ఆధీనంలోకి తీసుకునేందుకు గానూ కొందరు ప్రయత్నించారు. ఇందులో భాగంగా ఎక్స్‌కవేటర్, లారీలు తీసుకువచ్చి స్థలా లు చదును చేసి వాటిని ఎత్తు చేసే పనులు ప్రా రంభించారు. విషయం జిల్లా కలెక్టర్, కాకినాడ ఆర్డీవో దృష్టికి వెళ్లడంతో వారి ఆదేశాల మేరకు రెవెన్యూ, సిబ్బంది పోలీసులు అక్కడకు చేరుకున్నారు. అక్కడ పనులు జరుగుతున్నట్లు గుర్తించారు. ఎక్స్‌కవేటర్‌ను సీజ్ చేసి పిఠాపురం పట్టణ పోలీసుస్టేషన్‌కు తరలించారు. అక్కడ ఎలాంటి ఆక్రమణలు జరగకుండా ఉండేందుకు గానూ నిఘా ఏర్పాటు చేశారు.

ప్రభుత్వ స్థలాలు ఆక్రమిస్తే చర్యలు

ఖాళీ స్థలాల ఆక్రమణకు ప్రయత్నాలు జరిగిన ప్రాంతాలను పిఠాపురం మున్సిపల్ కమిషనరు కనకారావు శుక్రవారం పరిశీలించారు. ఎక్స్‌కవేటర్‌తో తవ్వి స్థలాలను ఎత్తు చేసే పనులు నిర్వహించినట్లు గుర్తించారు. ఇవన్నీ ప్రభుత్వ స్థలాలనీ, వీటిని ఆక్రమించేందుకు, అన్యాక్రాంతం చేసేందుకు ప్రయత్నిస్తే చట్టపరంగా చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. వాటిని ప్రభుత్వ కార్యాలయాలు, ఇతర అవసరాల నిమిత్తం ప్రత్యేకించారని తెలిపారు. వాటి పరిరక్షణకు చర్యలు తీసుకోవడంతో పాటు బోర్డులు ఏర్పాటు చేస్తామన్నారు. ఖాళీస్థలాలపై ప్రత్యేక దృష్టిపెట్టాలని టౌన్‌ప్లానింగ్, సచివాలయ సిబ్బందికి సూచించారు.

పొంచి ఉన్న ప్రమాదం!

సామర్లకోట, నవంబరు 8 (ఆంధ్రజ్యోతి): సామర్లకోట మున్సిపాల్టీలో వీధిలైట్ల నిర్వహణపై సిబ్బంది తీవ్ర నిర్లక్ష్యం వహిస్తున్నారు. పట్టణంలో మఠంసెంటర్ వద్ద హైమాస్ట్ లైట్‌కు సంబంధించి మీటర్ కమ్ టైమర్ బాక్స్ స్తంభం నుంచి కిందికి రోడ్డుపైకి జారిపడి సుమారు 15 రోజులు దాటినా ఏమాత్రం పట్టించుకోవడంలేదని స్థానికులు ఆరోపించారు. విద్యుత్ వైర్లు కిందికి వేలాడుతూ విద్యుద్ఘాతానికి గురయ్యే ప్రమాదం పొంచి ఉన్నందున సత్వరం టైమర్ బాక్స్‌ను స్తంభానికి బిగించాలని పలు దఫాలు మున్సిపల్ లైటింగ్ సిబ్బందికి వివరించినా ఫలితం శూన్యమని అంటున్నారు. మున్సిపల్ కమిషనర్ పట్టణ సందర్శనలో ఇటువంటి ప్రమాదాలు సైతం పరిశీలించాలని పలువురు కోరుతున్నారు.



మఠం సెంటర్లో రోడ్డుపైకి జారిన హైమాస్ట్ లైట్ టైమర్ బాక్సు

దొంగతనాలకు పాల్పడుతున్న వ్యక్తి అరెస్ట్

రూ.5 లక్షల విలువైన సొత్తు స్వాధీనం



సమావేశంలో మాట్లాడుతున్న కాకినాడ రూరల్ సీఐ చైతన్యకృష్ణ

కాకినాడ రూరల్, నవంబరు 8(ఆంధ్రజ్యోతి): కాకినాడ రూరల్ మండలం ఇంద్రపాలెం పోలీస్‌స్టేషన్‌లో శుక్రవారం మీడియా సమావేశంలో కాకినాడ రూరల్ సీఐ డీఎస్ చైతన్య కృష్ణ మాట్లాడుతూ ఇటీవల దొంగతనాలకు పాల్పడుతున్న జగన్నాధపురానికి చెందిన పాతనేరస్థుడు బత్తిన లక్ష్మణరావును తూరంగి రోడ్డు బాలయోగి సెంటర్ వద్ద అరెస్టు చేశామని తెలిపారు. అతడి వద్ద నుంచి సుమారు రూ.5లక్షల విలువచేసే 59గ్రాముల బంగారం, 1,189 గ్రాముల వెండిని రికవరీ చేశామన్నారు. నిందితుడికి రిమాండ్‌కు తరలించామన్నారు. సమావేశంలో ఇంద్రపాలెం ఎస్‌ఐ ఎం.వీరబాబు, క్రైం పోలీసులు, ఏఎస్‌ఐ పాల్గొన్నారు.

రైసుమిల్లులో ప్రమాదం

చేయి కోల్పోయిన కార్మికుడు



చేతిని కోల్పోయిన కార్మికుడు నాగేశ్వరరావు

గొల్లప్రోలు, నవంబరు 8(ఆంధ్రజ్యోతి): గొల్లప్రోలులోని రైసుమిల్లులో జరిగిన ప్రమాదంలో కార్మికుడు చేయి కోల్పోయాడు. మండలంలోని తాటిపర్తి గ్రామానికి చెందిన గోనగాల నాగేశ్వరరావు(35) పట్టణ శివారు తాటిపర్తి పుంతరోడ్డులోని సాయి శ్రీదేవి రైసుమిల్లులో జట్టుకూలీగా పనిచేస్తున్నాడు. శుక్రవారం లారీ నుంచి ధాన్యం బస్తాలు అన్‌లోడ్ చేస్తుండగా ప్రమాదవశాత్తు మిల్లు కన్వేయర్ బెల్టులో పడిపోయాడు. దీంతో ఒక చేయి పూర్తిగా నుజ్జునుజ్జయింది. అతడిని కాకినాడ ప్రభుత్వాసుపత్రికి తరలించగా అక్కడ వైద్యులు చికిత్స చేసి చేతిని తొలగించారు. అతడికి భార్య, కుమారుడు, కుమార్తె ఉన్నారు. గొల్లప్రోలు పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

పాదగయలో అన్యమతస్తుడి విధుల నిర్వహణపై అభ్యంతరం

పిఠాపురం, నవంబరు 8(ఆంధ్రజ్యోతి): పిఠాపురం పాదగయ క్షేత్రంలోని కుక్కుటేశ్వర స్వామి సన్నిధిలో అన్యమతస్థుడిని అనధికారికంగా విధుల నిర్వహణ నిమిత్తం వినియోగించుకోవడంపై విశ్వహిందూ పరిషత్, భజరంగదళ్ అధ్యక్షుడు వెంకటేశ్వరరావు అభ్యంతరం వ్యక్తం చేశారు. అతడిని స్వామి అభిషేకాల నిర్వహణలో సహాయకుడిగా వినియోగించుకోవడం తగదన్నారు. హిందువుల మనోభావాలు దెబ్బతినకుండా ఆలయ అధికారులు చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. కాగా దీనిపై పాదగయ కార్యనిర్వహణాధికారి, సహాయకమిషనరు కాట్నం జగన్మోహన శ్రీనివాస్ వివరణ ఇచ్చారు. అర్చకు స్వాములను వివరణ కోరుతూ నోటీసులు ఇచ్చామన్నారు. అతడిని కొబ్బరి చెక్కలు మోసేందుకు నియమించుకున్న వ్యక్తి తప్ప మరే ఇతర సేవలకు వినియోగించడం లేదని వారు తెలిపారన్నారు. సదరు వ్యక్తి ఆలయంలో ప్రవేశించకుండా బాధ్యత వహిస్తామని అర్చకులు చెప్పారని తెలిపారు.

మద్యం తాగి వాహనాలు నడిపినవారికి జైలు, జరిమానా

కాకినాడ క్రైం, నవంబరు 8(ఆంధ్రజ్యోతి): మద్యం తాగి వాహనాలు నడిపి పట్టుబడిన 22మందికి కాకినాడ మూడో స్పెషల్ జ్యుడిషియల్ సెకండ్ క్లాస్ మేజిస్ట్రేట్ వి.నరసింహరావు జైలు, జరిమానా విధిస్తూ శుక్రవారం తీర్పు చెపారు. కాకినాడ ట్రాఫిక్ సీఐలు, ఎస్.రమేష్ డి.రామారావు తమ బృందాలతో గురువారం రాత్రి డ్రంకన్ డ్రైవ్ నిర్వహిస్తుండగా మోతాదు దాటి మద్యం తాగి వాహనాలు నడుపుతున్న వారిని బ్రీత్ ఎనలైజర్లతో పరీక్షించగా 22మంది పట్టుబడ్డారు. వారిని కోర్టులో హాజరుపర్చగా ఇద్దరికి ఒక్కోక్కరికి 3 రోజుల చొప్పున జైలు శిక్ష, మరో ఆరుగురికి ఒక్కోక్కరికి రెండురోజుల చెప్పున జైలు శిక్ష మిగతా 14 మందికి ఒక్కోక్కరికి రూ.10 వేలు చొప్పున జరిమానా విధించినట్టు సీఐ రమేష్ తెలిపారు.

నైపుణ్య గణన సర్వే పారదర్శకంగా చేయాలి

ఎంపీడీవో హిమమహేశ్వరి

సామర్లకోట, నవంబరు 8 (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ ప్రోత్సాహకాలు, ప్రభుత్వ పథకాలు అర్హులైన పేదలందరికీ అందేందుకు గ్రామాల్లో ఉన్న నైపుణ్యవ్యక్తుల గుర్తింపు సర్వే పారదర్శకంగా నిర్వహించాలని ఎంపీడీవో కె.హిమ మహేశ్వరి పేర్కొన్నారు. శుక్రవారం సామర్లకోట ఎంపీడీవో కార్యాలయంలో నైపుణ్య గణనకు చెంది పంచాయతీ కార్యదర్శులకు, డిజిటల్ అసిస్టెంట్లకు శిక్షణా తరగతులు నిర్వహించారు. సర్వేకు సంబంధించి సమగ్ర సమాచారాన్ని సిబ్బందికి వివరించారు. కార్యక్రమంలో ఈవోపీఆర్డీ భైరవమూర్తి, డిప్యూటీ తహశీల్దార్ వై.శ్రీనివాస్ పాల్గొన్నారు.

రేడియాలజీ విభాగం పరీక్షలు కీలకం

కాకినాడ జీజీహెచ్ సూపరింటెండెంట్ లావణ్యకుమారి



రేడియాలజీ డే వేడుకల్లో కేక్ కట్ చేస్తున్న డాక్టర్లు

జీజీహెచ్(కాకినాడ), నవంబరు 8(ఆంధ్రజ్యోతి): ప్రపంచ రేడియాలజీ డే వేడుకలను కాకినాడ జీజీహెచ్‌లో శుక్రవారం ఘనంగా నిర్వహించారు. రేడియాలజీ సమావేశ మందిరంలో ఏర్పాటు చేసిన ఈ కార్యక్రమానికి ఆసుపత్రి సూపరింటెండెంట్ డా.ఎస్‌లావణ్యకుమారి ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. రేడియాలజీ విభాగాధిపతి డా.అనురాధ అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమాన్ని సూపరింటెండెంట్ జ్యోతిప్రజ్వలన చేసి కేక్ కట్ చేసి ప్రారంభించారు. ఆమె మాట్లాడుతూ జీజీహెచ్‌కు వచ్చే రోగులు, క్షతగాత్రులు, గర్భిణులకు దేహంలో బయటకు కనిపించని సమస్యలకు రేడియాలజీ విభాగం ద్వారా జరిగే పరీక్షలు కీలకం అన్నారు. తద్వారా కచ్చితమైన వైద్య చికిత్స అందించేందుకు వీలు కలుగుతుందన్నారు. జీజీహెచ్‌లో 5 ఎక్స్‌రే ప్లాం ట్లు, 12 మొబైల్ ఎక్స్‌రే ప్లాంట్లు, 5 అల్ట్రాసౌండ్ పరికరాలు, 2కలర్‌డాప్లర్ పరికరాలు, ఒక సీటీ స్కాన్ యంత్రం, ఒక ఎంఆర్‌ఐ స్కాన్ య ంత్రం పూర్తిస్థాయిలో పని చేస్తున్నాయన్నారు. రోజూ వివిధ రుగ్మతలతో జీజీహెచ్‌కు వచ్చే సు మారు 4000 మందిలో 800 మందికి రేడియాలజీ విభాగం ఆధ్వర్యంలో పలు పరీక్షలు జరుగుతున్నాయన్నారు. ప్రపంచ రేడియాలజీ డే ను పురస్కరించుకుని ఈ ఏడాది కనిపించని దాని చూడగలగడం అనే నినాదంతో ఈ వేడుకలను జరుపుతున్నామన్నారు. ఈ విభాగంలో విధులు నిర్వర్తించే వైద్యులు, టెక్నీషియన్‌లు, సిబ్బంది ఆ పరికరాలు నుంచి వెలువడే రేడియేషన్ ప్రమా దం అని తెలిసి కూడా పేద ప్రజల ఆరోగ్యం కోసం పని చేయడం గర్వనీయమన్నారు. ఆర్ఎం సీ వైస్ ప్రిన్సిపాల్ డా.శశి, జీజీహెచ్ డిప్యూటీ సూపరిండెంట్ డా.పి.శ్రీనివాసన్, సీఎస్ఆర్ఎంవో డా.కోనాల అనిత, రేడియాలజీ అసోసియేట్ ప్రొఫెసర్లు డా.పాశం కుసుమలత, డా.కెఎస్ సునీత, అసిస్టెంట్ ప్రొఫెసర్లు డా.జి హరిత, డా.ఆర్ఎస్ శైలజా, డా.నూరున్నీసా బేగం, డా.ప్రసన్న, డా.రాము, రేడియోగ్రాఫర్లు, సిబ్బంది పాల్గొన్నారు.

సీపీఎం 'ప్రజాపోరు' ఆరంభం



ప్రజాపోరు ప్రారంభ కార్యక్రమంలో నాయకులు

కాకినాడ సిటీ, నవంబరు 8(ఆంధ్రజ్యోతి): ప్రజా సమస్యల పరిష్కారానికి సీపీఎం ఆధ్వర్యాన రాష్ట్రవ్యాప్తంగా తలపెట్టిన ప్రజాపోరు కార్యక్రమాన్ని శుక్రవారం కాకినాడ జీజీహెచ్ సెంటర్‌లోని జ్యోతీరావ్ పూలే విగ్రహం వద్ద ప్రారంభించారు. పరిసర ప్రాంతాల్లో సీపీఎం నగర కమిటీ సభ్యుడు కె.సత్తిరాజు, ట్రేడ్ యూనియన్ నాయకుడు సీహెచ్.రాజ్‌కుమార్ పర్యటించి ప్రజల సమస్యలు తెలుసుకున్నారు. అనంతరం వారు మాట్లాడుతూ ఈ నెల 14 వరకు నగరంలో వివిధ ప్రాంతాల్లో పర్యటించి కరపత్రాలు పంచుతూ ప్రభుత్వ విధానాలు ప్రజలకు తెలియజేస్తామన్నారు. ప్రజలు చెప్పేది వింటూ పర్యటన కొనసాగిస్తామన్నారు. 15న కలెక్టర్ కార్యాలయం వద్ద ధర్నా నిర్వహిస్తామని, ఈ ధర్నాలో ప్రజలు భాగస్వాములు కావాలని కోరారు. కార్యక్రమంలో సీపీఎం నగర కన్వీనర్ పలివెల వీరబాబు, మలక వెంకటరమణ, కె సత్తిబాబు, చంద్రమళ్ల పద్మ, నర్ల ఈశ్వరి, మేడిశెట్టి వెంకటరమణ తదితరులు పాల్గొన్నారు.

ఆర్టీసీ డిపోలో బాలల పరిరక్షణపై అవగాహన



బస్టాండ్‌లో అవగాహన కల్పిస్తున్న అధికారులు

కార్పొరేషన్ (కాకినాడ), నవంబరు 8(ఆంధ్రజ్యోతి): జిల్లా బాలల పరిరక్షణ విభాగం ఆధ్వర్యంలో కాకినాడ బస్టాండ్‌లో ప్రయాణికులకు శుక్రవారం అవగాహన సదస్సు నిర్వహించారు. భిక్షాటన వృత్తిలో ఉండి చిన్న పిల్లలతో భిక్షాటన చేయించేవారు.. అనుమానాస్పద వ్యక్తులు చిన్నపిల్లలతో ఉన్నచో, ఎవరైనా చిన్నపిల్లలు తప్పిపోయిన వెంటనే 1098 చైల్డ్ హెల్ప్‌లైన్ నెంబర్‌కు ఫోన్ చేయాలని సూచించారు. కార్యక్రమంలో కాకినాడ డిపో మేనేజర్ ఎంవీవీ మనోహర్, అసిస్టెంట్ మేనేజర్ టి.బాలకృష్ణ, స్టేషన్ మేనేజర్ వి.శ్రీనివాస్, పీఆర్వో సీహెచ్ వెంకటరాజు, జిల్లా బాలల విభాగం ఉద్యోగులు ప్రొటెక్షన్ ఆఫీసర్ జె.విజయ్, లీగల్ ఆఫీసర్ ఎం.సుధాకర్, కౌన్సిలర్ బి.దుర్గారాణి, ఎస్.చినబాబు, ఆర్.దుర్గాభవానీ, ఎన్‌వి లక్ష్మి పాల్గొన్నారు.

అసమానతలు లేని సమాజం కోసం పోరాటం

ఏపీ రైతు కూలీ సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కర్నాకుల వీరాంజనేయులు



చేబ్రోలులో ర్యాలీ నిర్వహిస్తున్న నాయకులు

గొల్లప్రోలు రూరల్, నవంబరు 8(ఆంధ్రజ్యోతి): అమరవీరులను స్ఫూర్తిగా తీసుకుని అసమానతలు లేని సమాజం కోసం పోరాటం సాగిద్దామని ఏపీ రైతు కూలీ సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కర్నాకుల వీరాంజనేయులు పిలుపునిచ్చారు. అమరవీరుల సంస్మరణ సభ సందర్భంగా గొల్లప్రోలు మండలం చేబ్రోలులో ఏఐఎఫ్‌టీయూ, ఏపీఆర్‌సీఎస్, ప్రజాసంఘాల ఆధ్వర్యంలో శుక్రవారం ర్యాలీ నిర్వహించారు. భారత విప్లవోద్యమయంలో అసువులు బాసిన అమరులకు నివాళులర్పించారు. ఏపీఆర్‌సీఎస్, ఏఐఎఫ్‌టీయూ ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లా అధ్యక్షులు వల్లూరి రాజబాబు, కుంచే అంజిబాబు, డి.నారాయణమూర్తి, మడికి సత్యం, బొచ్చా ఏసు, గుడాల చార్లెస్, కేశవరపు వీరన్న ఉన్నారు.

విద్యతో పాటు క్రీడల్లోనూ రాణించాలి : డీఎస్డీవో



స్పోర్ట్స్‌మీట్‌లో మాట్లాడుతున్న డీఎస్డీవో

కాకినాడఅర్బన్, నవంబరు 8: విద్యార్థులు చదువుతోపాటు క్రీడల్లోనూ రాణించాలని క్రీడా ప్రాధికారసంస్థ జిల్లా అధికారి బి.శ్రీనివాస కుమార్ అన్నారు. శుక్రవారం డీఎస్ఏ మైదానంలో నిర్వహించిన నారాయణ పాఠశాలల క్రీడా సంబరాలను శ్రీనివాసకుమార్ ప్రారంభించారు. నారాయణ ఏజీఎం రాఘవేంద్రరావు, పాఠశాలల సమాఖ్య జిల్లా కార్యదర్శి జార్జితో కలసి క్రీడాకారుల గౌరవవందనం స్వీకరించారు. విద్యార్థులకు ఖోఖో,కబడ్డీ వాలీబాల్, త్రోబాల్ రన్నింగ్ పోటీలు నిర్వహించారు. విజేతలకు ఏజీఎం రాఘవేంద్రరావు బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో డీజీఎం కృష్ణ, డీన్ చలపతి, సుంకరమూర్తి, సఫూర,రామతులసి పాల్గొన్నారు.

ఏరియా ఆసుపత్రిగా అభివృద్ధి చేయాలని ధర్నా



ఆసుపత్రి వద్ద ధర్నా చేస్తున్న సీపీఎం నేతలు

పెద్దాపురం, నవంబరు 8(ఆంధ్రజ్యోతి): పెద్దాపురం సీహెచ్‌సీని ఏరియా ఆసుపత్రిగా అభివృద్ధి చేయాలని కోరుతూ సీపీఎం ఆధ్వర్యంలో స్థానిక సీహెచ్‌సీ వద్ద శుక్రవారం ధర్నా నిర్వహించారు. సీపీఎం మండల కార్యదర్శి దారపురెడ్డి క్రాంతికుమార్ మాట్లాడుతూ 15 ఏళ్ల క్రితం ఏరియా ఆసుపత్రిగా, 100 పడకల ఆసుపత్రిగా అభివృద్ధి చేస్తామని హామీ ఇచ్చారని అప్పటి నుంచి ఇప్పటివరకూ కేవలం హామీలకే పరిమితమయ్యిందన్నారు. తక్షణమే పెద్దాపురం సీహెచ్‌సీని ఏరియా ఆసుపత్రిగా మార్చు చేయాలని వారు డిమాండ్ చేశారు. ఆసుపత్రి సూపరిన్‌టెండెంట్ డాక్టర్ సతీష్‌రెడ్డికి వినతి పత్రం అందజేశారు. నీలపాల సూరిబాబు, సిరిపురపు శ్రీనివాస్, కేదారి నాగు, సత్యనారాయణ, నరసింహమూర్తి,యాసలపు రమేష్ పాల్గొన్నారు.

విగ్రహాలకు ముసుగులు... ఫ్లెక్సీల తొలగింపు!

అమలులోకి వచ్చిన ఎమ్మెల్సీ ఎన్నికల కోడ్

పిఠాపురం, నవంబరు 8(ఆంధ్రజ్యోతి): పట్టణంలోని వివిధ ప్రాంతాల్లో ఏర్పాటు చేసిన రాజకీయ పార్టీలు, ప్రజాప్రతినిధుల ఫ్లెక్సీల తొలగింపును శుక్రవారం మున్సిపల్ అధికారులు చేపట్టారు. ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఎన్నికల కోడ్ అమలులోకి వచ్చిన నేపథ్యంలో మున్సిపల్ కార్యాలయం, చర్చి సెంటర్, పశువుల సంత తదితర ప్రాంతాల్లో ఏర్పాటు చేసిన పలు పార్టీల ఫ్లెక్సీలను తొలగించారు. అదే విధంగా మాజీ సీఎంలు ఎన్టీఆర్, రాజశేఖరరెడ్డి తదితరుల విగ్రహాలకు ముసుగులు వేశారు. ఫ్లెక్సీల తొలగింపు శనివారం కొనసాగుతుందని మున్సిపల్ అధికారులు తెలిపారు.

కేన్సర్‌పై అవగాహన ఉండాలి



అవగాహన కల్పిస్తున్న పీహెచ్‌సీ సిబ్బంది

కొత్తపల్లి, నవంబరు 8(ఆంధ్రజ్యోతి): కేన్సర్ వ్యాధి పట్ల ప్రతీఒక్కరూ అవగాహన కలిగి ఉండాలని, తప్పనిసరిగా పరీక్షలు చేయించుకోవాలని నాగులాపల్లి పీహెచ్‌సీ డాక్టర్ రిచి శర్మ విజ్ఞప్తి చేశారు. కేన్సర్ వ్యాధి నిర్ధారణ, నివారణపై శుక్రవారం నిర్వహించిన అవగాహన ర్యాలీలో ఆమె మాట్లాడారు. ముందస్తు పరీక్షలు చేయించుకోవడం ద్వారా కేన్సర్‌ని నివారించేందుకు అవకాశం ఉంటుందన్నారు. గ్రామాల్లో ఆరోగ్యసిబ్బంది ఇంటింటికి వచ్చి రక్తపరీక్షలు చేస్తారని తెలిపారు. హెచ్‌వీ గౌరీశ్వరి, ఆరోగ్యసిబ్బంది, ఆశా కార్యకర్తలున్నారు.

కట్టమూరులో మంత్రి సత్యకుమార్ పర్యటన



మంత్రి సత్యకుమార్‌ను సత్కరిస్తున్న బీజేపీ నాయకుడు విశ్వేశ్వరరావు

పెద్దాపురం, నవంబరు 8 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర వైద్య, ఆరోగ్యశాఖ మంత్రి వై.సత్యకుమార్‌యాదవ్ మండలంలోని కట్టమూరు గ్రామంలో శుక్రవారం పర్యటించారు. బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు బిక్కిన విశ్వేశ్వరరావు స్వగృహానికి చేరుకుని ముచ్చటించారు. మంత్రికి విశ్వేశ్వరరావు పూలమాలలు, దుశ్శాలువాలతో ఘన స్వాగతం పలికి ఘనంగా సత్కరించారు. కార్యక్రమంలో కూటమి నేతలు బిక్కిన శ్రీరామ్‌ప్రసాద్, ఏలేటి సుబ్బారావు, సత్తిబాబు, మేడిది శ్రీనివాస్, అడపా గంగాధర్, శివదుర్గ, ప్రకాష్, సత్తిబాబు పాల్గొన్నారు.

జాతీయస్థాయి వెయిట్ లిఫ్టింగ్ పోటీలకు ఎంపిక



పోటీల్లో పాల్గొన్న సాయికిరణ్

పిఠాపురం రూరల్, నవంబరు 8 (ఆంధ్రజ్యోతి): ఆల్‌ఇండియా సివిల్ సర్వీసెస్ జాతీయస్థాయి టోర్నమెంట్‌కు పిఠాపురం మండలం ఎల్ఎన్‌పురం సచివాలయంలో గ్రామ వెటర్నరీ అసిస్టెంట్‌గా పనిచేస్తున్న గొంప సాయికిరణ్ ఎంపికయ్యారు. ఆయన ఎన్టీఆర్ జిల్లా విజయవాడలోని ఇందిరాగాంధీ స్టేడియంలో శుక్రవారం జరిగిన ఆంధ్రప్రదేశ్ లెవెల్ టోర్నమెంట్ కమ్ సెలక్షన్స్‌లో పాల్గొని వెయిట్ లిఫ్టింగ్ పోటీలు 73కిలోల కేటగిరీలో, పవన్‌లిఫ్టింగ్ 74కిలోల కేటగిరీలో స్వర్ణ పతకాలు సాధించారు. సాయికిరణ్‌ను పలువురు అధికారులు, ప్రజాప్రతినిధులు అభినందించారు.

అలాగే పిఠాపురం తహశీల్దారు కార్యాలయంలో జూనియర్ అసిస్టెంట్‌గా పనిచేస్తున్న మోకా రాజుబాబు వెయిట్‌లిఫ్టింగ్ 107కిలోల కేటగిరిలో స్వర్ణ పతకాన్ని సాధించారు. ఆయన జాతీయ స్థాయి పోటీలకు ఎంపికయ్యారు.

యునైటెడ్ రెడీమేడ్ మర్చంట్స్ అసోసియేషన్ నూతన కార్యవర్గం ఎన్నిక

కాకినాడ సిటీ, నవంబరు 8 (ఆంధ్రజ్యోతి): యునైటెడ్ రెడీమేడ్ మర్చంట్స్ అసోసియేషన్ నూతన కార్యవర్గాన్ని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. స్థానిక జ్యోతుల మార్కెట్ వద్ద గల సీరత్ కమిటీ హల్‌లో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో నూతన కార్యవర్గ ఎన్నిక నిర్వహించారు. అసోసియేషన్ నూతన అధ్యక్షుడిగా ఎస్‌కే రహీమ్, కార్యదర్శిగా సత్తిబాబులను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ఉపాధ్యక్షులుగా ఎంకే మొహిద్దీన్, జిలాని, కోశాధికారిగా ఎండీ ఆసిఫ్ అలీ, సంయుక్త కార్యదర్శులుగా ఎస్‌కే మొహిద్దీన్, భాస్కర్, సంయుక్త కోశాధికారిగా బహదూర్, సలహాదారులుగా చెక్క శ్రీనివాస్, పి బాపన్నలతో పాటు సభ్యులను ఎన్నుకున్నారు. నూతన సభ్యులు ప్రమాణ స్వీకారం చేశారు. కార్యక్రమంలో అతిధులుగా టీడీపీ మైనారిటీ సెల్ నాయకులు ఎంఏ తాజుద్దీన్, ఎండీ అన్సర్, ఖాన్‌సయ్యద్ అలీ పాల్గొన్నారు.

ఏఎంవీఐలకు పదోన్నతులు

కార్పొరేషన్(కాకినాడ), నవంబరు 8(ఆంధ్రజ్యోతి): కాకినాడ ఆర్టీవో కార్యాలయంలో పనిచేస్తున్న అసిస్టెంట్ మోటార్ వెహికల్ ఇన్‌స్పెక్టర్ బి.శ్రీకాంత్, సబితలకు మోటార్ వెహికల్ ఇన్‌స్పెక్టర్లుగా పదోన్నతులిస్తూ ఉత్తర్వులు జారీ చేశారు. పలువురు అభినందనలు తెలిపారు.

డీవైఈవోల బాధ్యతల స్వీకరణ

పిఠాపురం, నవంబరు 8(ఆంధ్రజ్యోతి): జిల్లాలో ఇద్దరు డీవైఈవోలను నూతనంగా నియమిస్తూ ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. గొల్లప్రోలు ఎంఈవో-1గా పనిచేస్తూ ఇప్పటివరకూ పెద్దాపురం డీవైఈవోగా అదనపు బాధ్యతలు నిర్వర్తించిన వెంకటేశ్వరరావుకు కాకినాడ డివిజన్ జిల్లా ఉపవిద్యాశాఖాధికారి అదనపు బాధ్యతలు అప్పగించారు. అదే విధంగా పెద్దాపురం ఎంఈవో-1 ప్రభాకరశర్మ పెద్దాపురం డీవైఈవోగా నియమించారు. ఆయన పిఠాపురంలోని పెద్దాపురం డీవైఈవో కార్యాలయంలో శుక్రవారం బాధ్యతలు స్వీకరించారు.

'పూర్తిస్థాయి రీసెర్చ్ స్కాలర్స్‌ను కేటాయిస్తాం'

జేఎన్టీయూకే, నవంబరు 8 (ఆంధ్రజ్యోతి): ఎన్ఐఆర్ఎఫ్ 2027లో మెరుగైన ర్యాంకును సాధించేందుకు జేఎన్టీయూకే రెగ్యులర్ అధ్యాపకులకు పూర్తిస్థాయి రీసెర్చ్ స్కాలర్స్‌ను కేటాయిస్తామని ఉపకులపతి కేవీఎస్‌జీ మురళీకృష్ణ అన్నారు. వర్శిటీలోని వీసీ సమావేశ హాల్లో నేషనల్ ఇనిస్టిట్యూట్ ర్యాంకింగ్ ఫ్రేమ్‌వర్క్(ఎన్ఐఆర్ఎఫ్)లో ఉత్తమర్యాంకును జేఎన్టీయూకే పొందేందుకుగానూ రాష్ట్ర ఉన్నత విద్యామండలి నియమించిన నిపుణులకమిటీ అధికారులతో సమావేశమైంది. దీనికి ఐక్యూఏసీ డైరెక్టర్ ఎంహెచ్ఎం కృష్ణప్రసాద్ అధ్యక్షత వహించగా వీసీ, రెక్టార్ కేవీ రమణ, రిజిస్ట్రార్ రవీంద్రనాద్, డైరెక్టర్ వి.రవీంద్ర, నిపుణుల కమిటీ ప్రొఫెసర్ గుణశేఖరన్, ప్రొఫెసర్ మురుగన్ హాజరయ్యారు. ఈ సందర్భంగా వీసీ మాట్లాడుతూ జేఎన్టీయూకే ఎన్ఐఆర్ఎఫ్‌లో ఉత్తమర్యాంకు సాధించేందుకు విశ్వవిద్యాలయం నుంచి టాస్క్‌ఫోర్స్ ఏర్పాటుచేశామన్నారు. యూసీఈకేలోని మౌలికవసతుల కల్పన, ఇంజనీరింగ్ విభాగాలు, ప్రయోగశాలలను కమిటీ పరిశీలించి పలు సూచనలు చేసింది.

సమస్యల పరిష్కారానికి కృషి చేస్తా : ఆర్జేడీ

కాకినాడ రూరల్, నవంబరు 8(ఆంధ్రజ్యోతి): కళాశాలలోని సమస్యల పరిష్కారానికి తన వంతు కృషి చేస్తానని జోన్1, 2 ఆర్జేడీ శారద అన్నారు. కాకినాడ పీఆర్ ప్రభుత్వ జూనియర్, వృత్తి విద్యాకళాశాలలను ఆర్జేడీ శుక్రవారం అకడమిక్ సందర్శన చేశారు. కళాశాలల అధ్యాపకులు, విద్యార్థులనుద్దేశించి మాట్లాడుతూ విద్యార్థుల ఉత్తీర్ణతాశాతం పెంచేందుకు కృషి చేయాలన్నారు. వృత్తి విద్యాకళాశాలలో ఈసీ గ్రూపులో 491 మార్కులు సాధించిన సాయిలక్ష్మిని ఆర్జేడీ సత్కరించారు. కార్యక్రమంలో డీఐఈవో నూకరాజు, ప్రిన్సిపాల్స్ రాంబాబు, తిరుపతి అధ్యాపకులు పాల్గొన్నారు.

రేపు ఆర్ఎంపీలకు అవగాహన

తాళ్లరేవు, నవంబరు 8 (ఆంధ్రజ్యోతి): తాళ్లరేవు లయన్స్‌క్లబ్ నందు ఆదివారం గ్రామీణవైద్యులకు వ్యాధులపై అవగాహన కల్పించనున్నట్టు ఆర్ఎంపీ అసియేషన్ అధ్యక్షుడు కొప్పాడి శివప్రసాద్ తెలిపారు. తాళ్లరేవు, యానానికి చెందిన ఆర్ఎమ్‌పీలు హాజరుకావాలని కోరారు.

భీమేశ్వరాలయంలో విశేష పూజలు



విశేష అలంకారంలో స్వామివారు

సామర్లకోట, నవంబరు8 (ఆంధ్రజ్యోతి): కార్తీకమాస మహాపర్వ దినాలను పురస్కరించుకుని సామర్లకోట కుమారరామ భీమేశ్వరాలయం లో శుక్రవారం విశేష పూజలు నిర్వహించారు. ఆలయ పండితులు సో మేశ్వరశర్మ, చెరుకూరి రాంబాబు, రాజశేఖర్ శర్మ, అంజిబాబు, వెంకన్న, వినయ్ తదితరుల వేదమంత్రోచ్ఛారణల మధ్య అభిషేక, పుష్పార్చన పూజలు నిర్వహించారు. అధికసంఖ్యలో భక్తులు స్వామివారిని దర్శించి ప్రసాదాలు స్వీకరించారు. అలాగే లక్షపత్రి పూజలు, సాయంత్రం ఆలయ ధ్వజస్థంభం వద్ద ఆకాశదీప పూజలు, కార్తీకదీపారాధన సంఘ సభ్యులుచే నిర్వహించిన జ్యోతిర్లింగార్చన పూజల్లో అధిక సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు. నిత్యాన్నదాన పథకంలో భాగంగా ఆలయ ఆవరణలో సుమారు 800 మంది భక్తులకు అన్నదానం నిర్వహించారు.

'104 ఉద్యోగుల సమస్యలు పరిష్కరించాలి'

తాళ్లరేవు, నవంబరు 8 (ఆంధ్రజ్యోతి): గ్రామీణప్రాంతాల్లో ప్రజలకు వైద్యసేవలను అందిస్తున్న 104 ఉద్యోగుల సమస్యలు పరిష్కరించాలని తహసీల్దార్ త్రినాధరావుకు ఉద్యోగులు శుక్రవారం వినతిపత్రం అందజేశారు. బకాయి జీతాలను చెల్లించాలని, ఉద్యోగ భద్రత కల్పించాలని డిమాండ్ చేశారు. ఉద్యో గులు నాగార్జున, ప్రవల్లిక,రెడ్డి శ్రీహరి ఉన్నారు.

చట్టాలపై అవగాహన సదస్సు

గండేపల్లి, నవంబరు 8(ఆంధ్రజ్యోతి): నీలాద్రిరావుపేట గ్రామంలో ఎస్‌ఐ యువి శివనాగబాబు ఆధ్వర్యంలో చట్టాలపై అవగాహన సదస్సు నిర్వహించారు. జగ్గంపేట సీఐ వైఆర్‌కె శ్రీనివాస్ హాజరై మాట్లాడుతూ నీలాద్రిరావుపేట గ్రామం హైవేకు దగ్గరగా ఉన్నందున జాగ్రత్తలు వహించాలన్నారు. ప్రమాదాల నివారణకు సహకరించాలని ఆయన కోరారు.

రంపచోడవరం

• రంపచోడవరం • మారేడుమిల్లి • దేవీపట్నం • రాజవొమ్మంగి • అడ్డతీగల • గంగవరం • వై రామవరం • చింతూరు • కూనవరం • వీఆర్ పురం • ఎటపాక



అరుగుపై ఆడుకుంటున్న చిన్నారులు

ఇంటి అరుగే... అంగన్వాడీ కేంద్రం

ఎటపాక, నవంబరు 8 (ఆంధ్రజ్యోతి): అక్కడ అంగన్వాడీ కేంద్రం నిర్వహణకు పూరిగుడిసైనా లేదు. మండలంలోని కృష్ణవరం పంచాయతీ పరిధి భూపతిరావుపేట గిరిజన గ్రామంలో ఈ పరిస్థితి నెలకొంది. సుమారు తొమ్మిది మంది చిన్నారులు ఇక్కడ విద్యాభ్యాసం చేస్తున్నారు. రెండేళ్ల క్రితం గోదావరి వరదలకు అంగన్వాడీ కేంద్రం నిర్వహించే పూరి గుడిసె కాస్తా కొట్టుకుపోయింది. అప్పట్నుంచీ అంగన్‌వాడీ టీచర్ చిన్నారులను ఓ ఇంటి అరుగుపై కూర్చోబెట్టి నెట్టుకొస్తోంది. చిన్నారులు అరుగుపైనే బొమ్మలతో ఆడుకుంటున్నారు. చిన్నారుల తల్లిదండ్రులు ఈ సమస్యను పదేపదే ఐసీడీఎస్ అధికారుల దృష్టికి తీసుకెళ్లినా పట్టించుకున్న దాఖలాలు లేవు.



బాధితుల నుంచి వివరాలు సేకరిస్తున్న విద్యుత్ శాఖ ఏఈ రాజ్‌కపూర్

ట్రాన్స్‌ఫార్మర్ల పంపిణీలో అవకతవకలపై విచారణ

ఆంధ్రజ్యోతి ఎఫెక్ట్

కూనవరం, నవంబరు 8 (ఆంధ్రజ్యోతి): గిరిజన రైతులకు ట్రాన్స్‌ఫార్మర్ల పంపిణీలో జరిగిన అవకతవకలపై శుక్రవారం ఆంధ్రజ్యోతిలో వచ్చిన కథనానికి స్పందించి విద్యుత్ శాఖాధికారులు స్పందించారు. కూనవరం ఏఈ రాజ్‌కపూర్ ఆధ్వర్యంలో విచారణ చేపట్టారు. తనకు విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్ మంజూరై ఏడాదైనా అధికారులు అందజేయలేదని మట్టా సీతయ్య ఏఈకు తెలిపారు. గతేడాది విద్యుత్ అధికారుల నిర్లక్ష్యంగా తమ పంట ఎండిపోయిందని, డబ్బులు చెల్లించి ఏడాదైనా ఇప్పటికీ తమకు విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్ అందించలేదని బాధితులు ఏఈకు తెలిపారు. దీనిపై ఉన్నతాధికారులకు నివేదిక ఇస్తానని ఏఈ రాజ్‌కపూర్ 'ఆంధ్రజ్యోతి'కి తెలిపారు. విచారణలో 2023లో పని చేసిన ఏఈ పరశురామ్ పాల్గొన్నారు.

మాతృ, శిశు మరణాలను నివారించాలి

రంపచోడవరం, నవంబరు 8 (ఆంధ్రజ్యోతి): ఏజెన్సీలో మాతృ, శిశు మరణాలను నివారించే బాధ్యత వైద్యాధికారులదేనని ఐటీడీఏ పీవో కట్టా సింహాచలం పేర్కొన్నారు. శుక్రవారం ఆయన ఐటీడీఏ కార్యాలయంలో వైద్య, ఆరోగ్య శాఖ అధికారులు, సిబ్బందితో సమావేశం నిర్వహించారు. గర్భిణులకు ఎప్పటికప్పుడు వైద్య పరీక్షలు నిర్వహించి ఆసుపత్రుల్లో సుఖప్రసవాలు జరిగేలా చర్యలు చేపట్టాలన్నారు. గర్భిణులు పౌష్టికాహారం తీసుకునేలా వైద్యాధికారులు సూచించాలన్నారు. ఏడీఎంహెచ్‌వో జి.శిరీష, ఏరియా ఆసుపత్రి ఆర్‌ఎం వెంకట ఇందిర, సూపరింటెండెంట్ టి.శేషారెడ్డి, డాక్టర్ ఆదిలక్ష్మి, పీహెచ్‌సీల వైద్యాధికారులు, సూపర్‌వైజర్లు, ఏఎన్‌ఎంలు, ఆశా కార్యకర్తలు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న ఐటీడీఏ పీవో సింహాచలం



వృద్ధుడికి దుప్పటి అందజేస్తున్న దాన ధర్మ చారిటబుల్ ట్రస్టు ప్రతినిధులు

సామూహిక సీమంతాలు, దుప్పట్ల పంపిణీ

వై.రామవరం, నవంబరు 8 (ఆంధ్రజ్యోతి): మండలంలోని పెద ఊలెంపాడు గ్రామంలో దానధర్మ చారిటబుల్ ట్రస్టు సహాయంతో ఫౌండేషన్ ప్రతినిధి తోట రామకృష్ణ ఆధ్వర్యంలో స్థానికుడు బొగ్గుల కాటంరెడ్డి పర్యవేక్షణలో శుక్రవారం సామూహిక సీమంతాలు జరిపారు. వృద్ధులకు దుప్పట్లు పంపిణీ చేశారు. కార్యక్రమంలో బొగ్గుల సత్యనారాయణరెడ్డి, చోడి రాంబాబు, రాజ్‌కుమార్‌రెడ్డి, తోట సూర్యకుమారి, ధార్మిక కార్యకర్తలు పాల్గొన్నారు.

ఆదివాసీ కమ్యూనిటీ భవనం నిర్మాణానికి అనుమతివ్వాలి



తహసీల్దారుకు వినతిపత్రం ఇస్తున్న శేఖర్

దేవీపట్నం, నవంబరు 8 (ఆంధ్రజ్యోతి): మండలంలోని ఇందుకూరుపేటలో స్త్రీశక్తి భవనం పక్కనున్న 0.05 సెంట్ల గ్రామ కంఠం ప్రభుత్వ భూమిలో ఆదివాసీ కమ్యూనిటీ భవనం నిర్మాణానికి అనుమతి ఇవ్వాలని తహసీల్దారు సత్యనారాయణకు ఆదివాసీ జేఏసీ రాష్ట్ర వైస్ చైర్మన్ తెల్లం శేఖర్ శుక్రవారం వినతిపత్రం అందజేశారు. ఆయన వెంట ఆదివాసీ జేఏసీ దేవీపట్నం మండల కార్యదర్శి యలగాడ నాగేశ్వరరావు, రాష్ట్ర కార్యదర్శి కారం రామన్న దొర ఉన్నారు.

ముసురుమిల్లి ప్రాజెక్టు కాలువలో పూడిక తొలగించాలి

దేవీపట్నం, నవంబరు 8 (ఆంధ్రజ్యోతి): ముసురుమిల్లి ప్రాజెక్టు కాలువకు చిన్నభీంపల్లి గ్రామంలోని ఎర్ర చెరువు నుంచి తక్షణమే పూడికతీత తీయాలని ఆదివాసీ జేఏసీ రాష్ట్ర వైస్ చైర్మన్ తెల్లం శేఖర్ డిమాండ్ చేశారు. శుక్రవారం ఆయన ఈ మేరకు ఒక ప్రకటన విడుదల చేశారు. కాలువలో పూడిక తొలగించడం ద్వారా సార్వా, దాళ్వా పంటలకు సక్రమంగా సాగునీరందుతుందన్నారు. చిన్నభీంపల్లి గ్రామంలోని ఎర్రచెరువు నుంచి దేవారం, శరభవరం పంచాయతీ పరిధిలోని ఎస్.రామన్నపాలెం వరకు పూడిక తొలగించాలని అధికారులకు విజ్ఞప్తి చేశారు.



పూడిక పేరుకుపోయిన కాలువ

జగ్గంపేట

• జగ్గంపేట • తుని • ప్రత్తిపాడు

ముగిసిన రెవెన్యూ సదస్సులు

544 దరఖాస్తులు రాక

తొండంగి, నవంబరు 8 (ఆంధ్రజ్యోతి): మండలంలో రీ సర్వే జరిగిన గ్రామాల్లో నిర్వహించిన రెవెన్యూ సదస్సులు శుక్రవారంతో ముగిశాయి. అక్టోబరు 19న ఆనూరులో ప్రారంభమైన సదస్సులు పిఇ చిన్నయ్యపాలెం సదస్సుతో ముగిశాయి. మండలవ్యాప్తంగా పది గ్రామాల్లో సదస్సులు నిర్వహించగా 544 దరఖాస్తులు రైతుల నుంచి అందినట్టు తహశీల్దార్ మురార్జీ తెలిపారు. పిఇ చిన్నయ్యపాలెంలో ఆయన రైతుల నుంచి 41 దరఖాస్తులు స్వీకరించారు. భూ సంబంధిత సమస్యలకు సంబంధించి విస్తీర్ణంలో తేడా, వేరొకరి పేరు నమోదుకావడం, ఇతరుల పేరున ఎక్కువ విస్తీర్ణం నమోదు కావడం తదితర సమస్యలకు సంబంధించిన దరఖాస్తులు ఎక్కువగా వచ్చాయన్నారు. గ్రామాల వారీగా ఆనూరు 21, పైడికొండ 167, వేమవరం 78, పి.అగ్రహారం16, శృంగవృక్షం 76, గోపాలపట్నం15, ఏకొత్తపల్లి40, రావికంపాడు 73, కొమ్మనాపల్లి 17 దరఖాస్తులు అందాయన్నారు. సదస్సుల్లో రెవెన్యూ ఇన్‌స్పెక్టర్ జీఎస్‌వి రాజారావు, గ్రామ రెవెన్యూ అధికార్లు యు శ్రీనివాసరావు మణిరాజు తదితరులు పాల్గొన్నారు.



రైతుల నుంచి ఫిర్యాదులు స్వీకరిస్తున్న తహశీల్దార్ మురార్జీ

బీఎస్‌పేటలో ఆరుగురిని కరిచిన పిచ్చికుక్క



ఏరియా ఆసుపత్రిలో బీఎస్‌పేట వాసులు

తుని రూరల్, నవంబరు8(ఆంధ్రజ్యోతి): మండలంలోని బీఎస్ పేటలో పిచ్చికుక్క స్వైర విహారం చేసింది. ఈక్రమంలో గ్రామస్తులు పరుగులు తీశారు. కుక్క ఆరుగురిని కరిచింది. బీఎస్‌పేటకు చెందిన గల్లా సూర్యకాంత్, గల్లా లక్ష్మి,యానంశెట్టి శివ, ఆడారి నాగమణి, శ్రావణి, బుజ్జి గాయపడగా ఏరియా ఆసుపత్రికి తరలించారు. ఆ పిచ్చికుక్కను పట్టుకున్నారు.

ప్రత్యేక కార్యాచరణతో ముందుకెళ్తున్నాం

తుని ఎమ్మెల్యే యనమల దివ్య

తుని రూరల్, నవంబరు 8 (ఆంధ్రజ్యోతి): నియోజకవర్గంలో గత పాలకుల నిర్లక్ష్యంతో మురుగున పడిన అభివృద్ధి పనులకు కూటమి ప్రభుత్వంలో పూర్తి చేసేందుకు ప్రత్యేక కార్యాచరణతో ముందుకెళ్తున్నట్టు ఎమ్మెల్యే యనమల దివ్య స్పష్టం చేశారు. తేటగుంట టీడీపీ కార్యాలయంలో ఆమె శుక్రవారం మీడియాతో మాట్లాడారు. మీ ఇంటికి- మీ దివ్య కార్యక్రమంలో భాగంగా నియోజకవర్గంలో ప్రతి గడపను తట్టి ప్రతీ సమస్యను చూశానని వాట న్నింటిని పరిష్కరించే దిశగా ముందుకు వెళుతున్నట్టు ఆమె తెలిపారు. ముఖ్యంగా రోడ్డు పనులకు యుద్ధప్రాతిపదికన మరమ్మతులు చేపడుతున్నామని, ఇప్పటికే నియోజకవర్గానికి రూ.1.90కోట్లు విడుదల కాగా హంసవరం, కృష్ణాపురం, వేమవరం, రావికంపాడు, రమణయ్యపేట రోడ్డు, ఏవీనగరం, పెరుమాళ్ళపురం రోడ్డు, తుని నర్సీపట్నం రోడ్లలో మరమ్మతులు చేపడుతున్నట్టు చెప్పారు.



వివరాలు వెల్లడిస్తున్న ఎమ్మెల్యే దివ్య

ఏఐ టెక్నాలజీపై వర్క్‌షాప్

తుని రూరల్, నవంబరు 8 (ఆంధ్రజ్యోతి): శ్రీప్రకాష్ అనుబంధ సంస్థ అయిన స్పేసెస్ డిగ్రీ కళాశాలలో కృత్రిమ మేధా ఏఐ టెక్నాలజీపై వర్క్‌షాప్ నిర్వహించారు. డిపార్ట్‌మెంట్ ఆఫ్ కంప్యూటర్ సైన్స్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన కార్యక్రమానికి వక్తలుగా డాక్టర్ చందూరి మాధవరావు, అసోసియేట్ ప్రొఫెసర్ వై.శివప్రసాద్, రీజనల్ మేనేజర్ ఆఫ్ అకడమిక్ కేఎల్ యూనివర్సిటీ విజయవాడ నుంచి హాజరై మాట్లాడారు. విద్యార్థులు పాల్గొన్నారు.

అగ్నిప్రమాద బాధిత కుటుంబాన్ని ఆదుకోవాలి



ఆందోళన చేస్తున్న నాయకులు

జగ్గంపేట, నవంబరు 8 (ఆంధ్రజ్యోతి): రంగవల్లినగర్‌లో భద్రాసి శివ అనే రోజువారి కూలీ ఇల్లు షార్ట్ సర్క్యూట్ వల్ల అగ్నిప్రమాదంలో కాలిపోవడంతో శుక్రవారం ఆంధ్రప్రదేశ్ రైతు కూలీ సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కర్నాకుల వీరాంజనేయులు నేతృత్వంలో ఏపీఆర్‌సీఎస్, ఏఐఎఫ్‌టీయూ నాయకులు బాధిత కుటుంబాన్ని పరామర్శించి ఆందోళన తెలిపారు. అగ్నిప్రమాద బాధిత కుటుంబాన్ని ప్రభుత్వం అన్నివిధాలా ఆదుకోవాలని డిమాండ్ చేశారు. ఇంటి నిర్మాణానికి ఆర్థిక సాయం అందించాలని, ఆధార్‌కార్డు, రేషన్‌కార్డు వంటిపత్రాలు అందించాలని కోరారు. కార్యక్రమంలో ఏపీఆర్‌సీఎస్ ఉమ్మడి జిల్లా అధ్యక్షుడు వల్లూరి రాజబాబు, ఏఐఎఫ్‌టీయూ ఉమ్మడి జిల్లా అధ్యక్షుడు కుంచె అంజిబాబు, ఏపీఆర్‌సీఎస్ నాయకులు కర్నాకుల రామలింగేశ్వరరావు, బి.సురేష్, జాను, దాన్ శ్రీను, సోమరాజు అర్జున్ ఆంధ్ర పాల్గొన్నారు.

ఉపాధి పథకంపై సమీక్ష



సమావేశంలో మాట్లాడుతున్న ఎంపీడీవో

గండేపల్లి, నవంబరు 8 (ఆంధ్రజ్యోతి): మండల ప్రజా పరిషత్ కార్యాలయంలో శుక్రవారం ఎంపీడీవో నాతి బుజ్జి ఉపాధి హామీ పథకంపై సిబ్బందితో సమీక్షా సమావేశం నిర్వహించారు. వంద రోజుల పనిదినాల కల్పన, హౌసింగ్ 90 పనిదినాలు, సీసీ రోడ్లు, పశువుల షెడ్లపై యాప్‌లో అప్లోడ్ చేయడం, ఇంకుడు గుంతలపై అడిగి తెలుసుకున్నారు. ఏవో చంద్రరావు, ఏపీవో గంగాభవానీ పాల్గొన్నారు. సచివాలయం ఉద్యోగులకు నిర్వహించిన స్కిల్ డెవలప్‌మెంట్ అవగాహన కార్యక్రమానికి ఎంపీడీవో బుజ్జి ముఖ్యఅతిథిగా హాజరయ్యారు.

నిర్లక్ష్యంగా ఉన్న కళాశాలపై చర్యలు తీసుకోండి

పీడీఎస్‌యూ విద్యార్థి సంఘం డిమాండ్

ప్రత్తిపాడు, నవంబరు 8 (ఆంధ్రజ్యోతి): ప్రత్తిపాడులోని ఒక ప్రైవేట్ కళాశాలలో జూనియర్ ఇంటర్ చదువుతున్న బాలిక అదృశ్యం వ్యవహారంలో నిర్లక్ష్యంగా వ్యవహరించిన కళాశాలపై చర్యలు తీసుకోవాలని ప్రగతిశీల ప్రజాస్వామ్య విద్యార్థి సంఘం డిమాండ్ చేసింది. శుక్రవారం ఆ విద్యార్థి సంఘం జిల్లా ప్రధానకార్యదర్శి శ్రీకాంత్, రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కె.సతీష్ ప్రత్తిపాడు విచ్చేసి ఇంటర్ విద్యార్థిని అదృశ్యంపై పరిశీలన చేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం వచ్చాక మహిళలపై, విద్యార్థులపై అఘాయిత్యాలు పెరుగుతున్నాయని ఆందోళన వ్యక్తం చేశారు. కళాశాలకు వచ్చిన బాలిక అదృశ్యం వ్యవహారంలో యాజమాన్యం, విద్యాశాఖాధికారులు నిర్లక్ష్యంగా వ్యవహరించారని దీనిపై వెంటనే చర్యలు తీసుకోవాలని లేకపోతే ఉద్యమాలు చేపడతామన్నారు.



ప్రత్తిపాడులో మాట్లాడుతున్న పీడీఎస్‌యూ విద్యార్థి సంఘం నాయకులు

ఆసుపత్రి మార్చురీకి ఫ్రీజర్ ఏర్పాటు చేయాలి



మంత్రిని కలిసిన వెంకట్రావు

ప్రత్తిపాడు, నవంబరు 8 (ఆంధ్రజ్యోతి): ప్రత్తిపాడు ప్రభుత్వ విధాన పరిషత్ కమ్యూనిటీ హెల్త్ సెంటర్ మార్చురీకి ఫ్రీజర్ ఏర్పాటు చేయాలని బీజేపీ జిల్లా ఉపాధ్యక్షుడు ఉమ్మడి వెంకట్రావు కోరారు. పెద్దాపురంలో శుక్రవారం బీజేపీ కార్యాలయ ప్రారంభానికి విచ్చేసిన మంత్రి సత్యకుమార్‌ను ఉమ్మడి కలిసి ప్రత్తిపాడు ఆసుపత్రిలో ఉన్న సమస్యలు వివరించారు. మార్చురీకి ఫ్రీజర్ లేకపోవడం వల్ల మృతదేహాలను భద్రపరచడం కష్టమవుతుందన్నారు. ఆసుపత్రిలో ఆర్థోపెడిక్ వైద్యుడు లేకపోవడం వల్ల రోడ్డు ప్రమాద బాధితులను కాకినాడకు తరలించాల్సి వస్తుందన్నారు. రోగులు, కుటుంబీకులకు విశ్రాంతి మందిరం ఏర్పాటుచేయాలని కోరగా మంత్రి వాటన్నింటిపై సానుకూలంగా స్పందించారని తెలిపారు.

అమరవీరుల వర్ధంతి సభ

జగ్గంపేట, నవంబరు 8 (ఆంధ్రజ్యోతి): జగ్గంపేట స్టాలిన్ భవన్‌లో అమరవీరుల వర్ధంతి సభ జరిగింది. చంద్రపుల్లారెడ్డి చిత్రపటానికి పూలమాల వేసి అమరవీరులందరికీ నివాళులర్పించారు. సీపీఐ(ఎంఎల్) న్యూడెమోక్రసీ కేంద్ర కమిటీ పిలుపులో భాగంగా ఈ సభ నిర్వహించారు. వి.చిట్టిబాబు, సీపీఐ (ఎంఎల్) న్యూ డెమోక్రసీ జిల్లా నాయకులు లక్ష్మి, కిరణ్‌కుమార్, రామిరెడ్డి, శ్రీనివాస్, గణపతి, భవాని, వరద రాజు, గణేష్ తదితరులున్నారు.

సమస్యలు పరిష్కరించాలి

తొండంగి, నవంబరు 8 (ఆంధ్రజ్యోతి): 104 ఉద్యోగుల సమస్యలు పరిష్కరించాలని కోరుతూ శుక్రవారం మండల రెవెన్యూ అధికారికి, మండలాభివృద్ధికి అధికారికి వినతి పత్రం అందించారు. 104 వైద్యసేవల్ని స్థానిక ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల ద్వారా నిర్వహించాలని, 3నెలలుగా బకాయి ఉన్న జీతాలను తక్షణం చెల్లించాలని తదితర డిమాండ్లతో కూడిన వినతిపత్రాన్ని తహశీల్దార్ మురార్జీకి అందించారు. డివిజన్ నాయకులు ఆర్ హరిప్రసాద్, సుధీర్, రమేష్, అభిషేక్, సుబ్రహ్మణ్యం పాల్గొన్నారు.



వినతి అందిస్తున్న 104 ఉద్యోగులు

వ్యక్తి అదృశ్యంపై కేసు

తుని రూరల్, నవంబరు 8 (ఆంధ్రజ్యోతి): శ్రీకాకుళం జిల్లా పొన్నాడ గ్రామానికి చెందిన 30ఏళ్ల జల్లు జనార్ధన్ రావు తుని రైల్వే స్టేషన్‌లో అదృశ్యమైనట్టు రైల్వే పోలీసులకు ఫిర్యాదు అందింది. జనార్ధన్‌రావు కొద్దికాలంగా పాయకరావుపేట ఓ ప్రైవేట్ ఫైనాన్స్ కంపెనీలో పని చేస్తున్నట్టు రైల్వే పోలీసులు తెలిపారు. కొద్దికాలంగా ఎవరికీ అందుబాటులో లేకపోవడం, ఇంటికి రాకపోవడంతో జనార్ధన్‌రావు తండ్రి ఇచ్చిన ఫిర్యాదుపై కేసు నమోదు చేసినట్టు రైల్వే ఎస్‌ఐ శ్రీనివాసరావు తెలిపారు. వ్యక్తి ఆచూకీ తెలిసిన వారు ఉంటే రైల్వే పోలీసులకు సమాచారం ఇవ్వాలని ఎస్‌ఐ కోరారు.

చట్టాలపై అవగాహన

శంఖవరం, నవంబరు 8 (ఆంధ్యజ్యోతి): విద్యార్థులకు చట్టాలపై అవగాహన ఉండాలని ప్రత్తిపాడు సీఐ సూరి అప్పారావు అన్నారు. కత్తిపూడిలో గురువారం చట్టాలపై ఓ కళాశాల విద్యార్థులకు అవగాహన కల్పించారు. చెడు వ్యసనాలకు దూరంగా ఉండాలని ఆయన సూచించారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ సీహెచ్ వీరబాబు, ఎస్‌ఐ శ్రీహరిబాబు పాల్గొన్నారు.



అవగాహన కల్పిస్తున్న సీఐ

ఘనంగా చండీహోమం



పూర్ణాహుతి గావిస్తున్న పండితులు

అన్నవరం, నవంబరు 8 (ఆంధ్రజ్యోతి): రత్నగిరి క్షేత్రరక్షకిగా పూజలందుకుంటున్న వనదుర్గ ఆలయంలో శుక్రవారం చండీహోమం ఘనంగా జరిగింది. ఉదయం 9గంటలకు పండితులు గణపతిపూజ, పుణ్యాహవచనం అనంతరం అమ్మవారికి చండీ,సప్తసతి పారాయణలు, మూలమంత్రజపములు పఠించారు. 11గంటలకు పవిత్ర హోమగుండంలో సుగంధద్రవ్యాలను అర్పించి పూర్ణాహుతి గావించారు. చతుర్వేదపండితుల వేదాశీర్వచనాలు అనంతరం భక్తులకు తీర్థప్రసాదాలందజేశారు.

ఓటర్ల జాబితాలపై శిబిరాలు

ప్రత్తిపాడు, నవంబరు 8 (ఆంధ్రజ్యోతి): నియోజకవర్గంలో ఈనెల 9, 10, 23, 24 తేదీల్లో 227 పోలింగ్ కేంద్రాల పరిధిలో బూత్ లెవెల్ అధికారులతో ఓటర్ల జాబితాలపై ప్రత్యేక శిబిరాలు నిర్వహిస్తున్నట్టు తహశీల్దార్ సూర్యప్రభ తెలిపారు. ప్రత్తిపాడు, శంఖవరం, రౌతులపూడి మండలాలతో పాటు ఏలేశ్వరం నగర పంచాయతీలో ఉదయం 9నుంచి సాయంత్రం 5గంటల వరకు బూత్ లెవెల్ అధికారులు అందుబాటులో ఉంటారన్నారు. ఓటరు జాబితానందు నమోదు, మార్పులు, తొలగింపులు, అర్హులైనవారు పోలింగ్ కేంద్రాల్లో నమోదు చేసుకోవాలని తహశీల్దార్ కోరారు.

మృత్స్యకార సంఘం ఎన్నికలు

కోటనందూరు, నవంబరు 8 (ఆంధ్రజ్యోతి): మండలంలోని అల్లిపూడి మృత్స్యకార సంఘం ఎన్నికలు శుక్రవారం ప్రశాంతంగా ముగిశాయి. ఎన్నికల అధికారి జగ్గంపేట ఎఐఎఫ్ అధికారి కర్రి రామకృష్ణ ఆధ్వర్యంలో నిర్వహించగా అధ్యక్షుడిగా పడాల శివ, ఉపాధ్యక్షుడిగా పత్తికొండ సత్యనారాయణ, ప్రధాన కార్యదర్శిగా నక్కా కామరాజు ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. సీనియర్ టీడీపీ నేతలు అంకంరెడ్డి బుల్లిబాబు, మాజీ ఎంపీటీసీ రుత్తల శ్రీనివాస్, అంకంరెడ్డి గోపి తదితరులు అభినందనలుతెలిపారు.

బలరామపురంలో అన్నదానం

రౌతులపూడి, నవంబరు 8(ఆంధ్రజ్యోతి): బలరామపురం గ్రామంలో దుర్గాదేవి ఆలయం వద్ద అన్నదానం నిర్వహించారు. కార్తీక మాసం సందర్భంగా ఆలయధర్మకర్త మానివెల్లి రమణ ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ కార్యక్రమానికి అధికసంఖ్యలో ప్రజలు హాజరయ్యారు.

పాస్టర్స్ అసోసియేషన్ ఎన్నిక

రౌతులపూడి, నవంబరు 8(ఆంధ్రజ్యోతి): మండల పాస్టర్స్ అసోసియేషన్ నూతన కార్యవర్గం ఎన్నిక శుక్రవారం జరిగింది. రౌతులపూడి గ్రామానికి చెందిన శామ్యూల్‌ను అధ్యక్షుడిగా, ఉపాధ్యాక్షుడిగా కేపీ శామ్యూల్‌ను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. సెక్రటరీగా యాదగిరి జ్యోతిబాబు, జాయింట్ సెక్రటరీగా ఎం.ఏసు బాబు, ట్రేజరర్‌గా ఎం.శాంతరావు, కన్వీనర్‌గా గంటా బాస్కర్ నియమితులయ్యారు.

ఎక్సైజ్ పోలీసుల దాడులు

ప్రత్తిపాడు, నవంబరు 8 (ఆంధ్రజ్యోతి): ఎక్సైజ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ స్క్వాడ్ ప్రత్తిపాడు సర్కిల్ పరిధిలో శుక్రవారం దాడులు నిర్వహించారు. ఎన్‌ఫోర్స్‌మెంట్ ఎస్‌ఐ విజయలక్ష్మి, సిబ్బంది సిరిపురంలో తోట వెంకన్నను అరెస్ట్ చేసి 20లీటర్ల సారా స్వాధీనం చేసుకున్నారు. మెట్టిచింత గ్రామంలో 800లీటర్ల బెల్లపు ఊట ధ్వంసం చేశారు. ఎక్సైజ్ సీఐ శివప్రసాద్,ఎస్‌ఐ వంశీరామ్ మండలంలోని ఈ.గోకవరం గ్రామంలో నాటుసారా బట్టీ దాడులపై నిర్వహించి 600 లీటర్ల బెల్లపు ఊటను ధ్వంసం చేశారు.

యనమలను కలిసిన ఎమ్మెల్యే

ప్రత్తిపాడు, నవంబరు 8 (ఆంధ్రజ్యోతి): టీడీపీ పొలిట్‌బ్యూరో సభ్యుడు యనమల రామకృష్ణుడిని శుక్రవారం ప్రత్తిపాడు ఎమ్మెల్యే వరుపుల సత్యప్రభ రాజా మర్యాదపూర్వకంగా కలిశారు. తేటగుంటలోని క్యాంప్ కార్యాలయంలో కలిసి నియోజకవర్గంలోని టీడీపీ పరిస్థితి తదితర అంశాలపై చర్చించారు. ఆమె వెంట పలువురు టీడీపీ నాయకులు ఉన్నారు.



యనమలను కలిసిన ఎమ్మెల్యే సత్యప్రభ



టీడీపీ సభ్యత్వ నమోదు

దేవీపట్నం, నవంబరు 8 (ఆంధ్రజ్యోతి): మండలంలోని ఇందుకూరు-1, ఏనుగులగూడెం, అగ్రహారం, మంటూరు, పునరావాస కాలనీల్లో సర్పంచ్ కుంజం రాజామణి ఆధ్వర్యంలో శుక్రవారం టీడీపీ సభ్యత్వ నమోదు నిర్వహించారు. క్లస్టర్ ఇన్‌చార్జి మాగాపు బాబూరావు, నియోజకవర్గ మహిళా ఉపాధ్యక్షురాలు కారం పోశమ్మ పాల్గొన్నారు.

ఆన్‌లైన్ స్ర్కీనింగ్ పరీక్ష వాయిదా

రంపచోడవరం, నవంబరు 8 (ఆంధ్రజ్యోతి): రంపచోడవరం, చింతూరు డివిజన్లలో డీఎస్సీ ఉచిత కోచింగ్ కోసం ఎస్సీ, ఎస్టీ విద్యార్థులకు ఆదివారం నిర్వహించాల్సిన ఆన్‌లైన్ స్ర్కీనింగ్ పరీక్ష ఎమ్మెల్సీ ఎన్నికల కోడ్ అమలులో ఉన్న కారణంగా వాయిదా పడినట్టు ఐటీడీఏ పీవో కట్టా సింహాచలం శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు.

రేపు సిరిగిందలపాడులో ప్రత్యేక వైద్య శిబిరం

రంపచోడవరం, నవంబరు 8 (ఆంధ్రజ్యోతి): రాజమహేంద్రవరం రామకృష్ణ మిషన్ గిరిజన సంచార వైద్యశాల ఆధ్వర్యంలో ఆదివారం సిరిగిందలపాడులో ప్రత్యేక వైద్య శిబిరం నిర్వహిస్తున్నట్టు రామకృష్ణ మిషన్ కార్యదర్శి స్వామి పరిజ్ఞేయనంద మహరాజ్ తెలిపారు. మూర్ఛ, ఫిట్స్, సామాన్య రోగాలకు వైద్య పరీక్షలు నిర్వహించి మందులు పంపిణీ చేస్తామన్నారు. ఫిట్స్ రోగులకు నాలుగు నెలలకు సరిపడా మందులు ఇస్తామన్నారు. వేమగిరి పరమహంస నేత్రాలయం వైద్యులు కంటి పరీక్షలు చేసి అవసరమైన వారికి కళ్లజోళ్లు అందజేయడమే కాక ఆపరేషన్లు నిర్వహిస్తారని తెలిపారు. కంటి పరీక్షలకు వచ్చేవారు రేషను, ఆధార్ కార్డులు తీసుకురావాలని సూచించారు.

'ఏజెన్సీ చట్టాలు ఉల్లంఘిస్తున్న అధికారిపై క్రిమినల్ కేసు నమోదు చేయాలి'

రంపచోడవరం, నవంబరు 8 (ఆంధ్రజ్యోతి): రంచోడవరం డివిజన్‌లోని ఏడు మండలాల్లో మద్యం షాపుల సిండికేట్‌లో కీలకంగా వ్యవహరిస్తూ ఏజెన్సీ చట్టాలను ఉల్లంఘిస్తున్న డ్వామా పీడీ ముఖలింగంపై పీసా చట్టం ప్రకారం క్రిమినల్ కేసు నమోదు చేయాలని సీపీఎం జిల్లా కార్యవర్గ సభ్యులు లోతరామారావు, మట్ల వాణిశ్రీ డిమాండ్ చేశారు. వైసీపీ ప్రభుత్వ హయాంలో ముఖలింగం కీలకంగా వ్యవహరించి పదోన్నతి పొందాడన్నారు. కూటమి ప్రభుత్వంలో కూడా డాన్‌గా వ్యవహరిస్తున్నాడన్నారు. సిండికేట్ వ్యవహారంలో సంబంధమున్న ఇతర అధికారులపైనా విచారణ జరిపి సస్పెండ్ చేయాలన్నారు. ముఖలింగం ఆర్థిక వ్యవహారాలపై విజిలెన్స్ ఎంక్వయిరీ చేపట్టాలన్నారు.